

సముచితమే కానీ..!

- మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణంతో పెరిగిన రద్దీ
- ఏడాదిలో 4కోట్ల 38లక్షల మంది మహిళల ప్రయాణం
- రీజియన్ పరిధిలో సంస్థకు రూ.211కోట్ల ఆదాయం
- అయినా రద్దీకి తగ్గట్లు పెరగని బస్సులు
- కొన్ని రూట్లలో సర్వీసులు తొలగించినట్లు ఆరోపణలు
- మహిళలను చులకనగా చూస్తున్న కొందరు సిబ్బంది
- తీరు మారకపోతే సమస్యలు పెరిగే అవకాశం
- 'మహాలక్ష్మి' పథకానికి నేటితో ఏడాది పూర్తి


ఖమ్మం, ఖానాపురంహవేలి డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీల్లో ఒకటైన ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పథకం సోమవారంతో ఏడాది పూర్తి చేసుకుంది. 2023 డిసెంబరు 9న రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని కల్పించింది. దీంతో ఉమ్మడి జిల్లా పరిధిలోని ఏడు ఆర్టీసీ డిపోల పరిధిలోని బస్సుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగి సంస్థకు ఆదాయం పెరిగింది. ఉమ్మడి జిల్లాలో 2023 డిసెంబరు 9నుంచి 2024 డిసెంబరు 9 వరకు 4కోట్లా, 38 లక్షల, 32వేల, 241మంది మహిళలు ఆర్టీసీలో ఉచితంగా ప్రయాణించగా సంస్థలకు ప్రభుత్వం నుంచి రూ.211కోట్ల ఆదాయం సమకూరింది. ఈ ఉచిత ప్రయాణ పథకంతో పేద, మధ్యతరగతి కుటుంబాల్లో ఆనందాలు వెల్లువిరుస్తున్నాయి.

అభ్యంతరకరంగా కొందరు కండక్టర్ల తీరు..

మహిళలకు ఉచిత ప్రయాణంతో పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ భారీగా పెరిగింది. సీట్లు దొరక్కపోవడంతో కొన్ని ప్రాంతాల్లో గొడవలు జరుగుతున్నాయి. మరికొన్ని సందర్భాల్లో కండక్టర్ల తీరుతో ఒకింత అసహనానికి గురవుతున్న మహిళలు వారిని ఎదిరించి మాట్లాడలేక, మౌనంగా ఉండలేక సతమతమవుతున్నారు. మహిళల సంఖ్య ఎక్కువగా ఉన్న సందర్భాల్లో బస్సులను ఆపకుండానే వెళ్తున్నారంటూ ఆర్టీసీ సిబ్బంది తీరుపై మహిళలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఉచిత ప్రయాణానికి ప్రభుత్వం నుంచి సొమ్ము అందుతున్నా మహిళల పట్ల కొందరు కండక్టర్లు చులకన భావంతో వ్యవహరిస్తుండటాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. ముఖ్యంగా కొందరు మహిళా కండక్టర్లు సైతం ఇలా వ్యవహరిస్తున్నారని మహిళలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఆధార్ కార్డులతో సమస్య..

ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణం కోసం ఆధార్ కార్డులనే ప్రామాణికంగా తీసుకుంటుండగా కొన్ని సందర్భాల్లో ఆ కార్డులే సమస్యగా మారాయి. కొందరు 15 సంవత్సరాల క్రితం దిగిన ఆధార్ కార్డులతో ప్రయాణిస్తుండగా అప్పటి ఫొటోకు ఇప్పటి ఫొటోకు తేడా ఉండటంతో కండక్టర్లు కొని సందర్భాల్లో ఆయా కార్డులను తిరస్కరించి టికెట్ అడుగుతున్నారు. దాంతో గొడవలు జరుగుతున్నాయి. మరికొందరి దగ్గర ఉన్న పాత కార్డుల్లో రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని ఉండటంతో ఆయా కార్డులను కూడా కండక్టర్లు తిరస్కరించిన సంఘటనలు ఉన్నాయి. ఇలాంటి (మిగతా 6వ పేజీలో)



సభా సమయం


అధ్యక్షా ఆలకించరూ..!

- నిధుల లేమితో నత్తనడకన సీతారామ ప్రాజెక్టు పనులు
- ఆశలపల్లకీలో కొత్తగూడెం ఎయిర్‌పోర్టు ఏర్పాటు
- పైసలిస్తేనే ఉమ్మడి జిల్లాలో పర్యాటక అభివృద్ధి
- అపరిష్కృతంగానే 'ఐదు' పంచాయతీల సమస్య
- రాష్ట్ర క్యాబినెట్‌లో కీలకశాఖల్లో జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు
- ఎమ్మెల్యేలంతా అధికార పార్టీవారే..
- మంత్రులు చొరవ చూపితేనే సమస్యలకు పరిష్కారం

6

ఉమ్మడి జిల్లాలో అపరిష్కృతంగా అనేక సమస్యలు

అసెంబ్లీ శీతాకాల సమావేశాలు నేడు ప్రారంభమవుతున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి కావడంతో ఈ సమావేశాలు వాడీవేడిగా సాగే అవకాశముంది. ఒక పక్క ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలు తీరుపై ప్రతిపక్షాలు గళమెత్తుతున్న వేళ ఉమ్మడి జిల్లాలో అపరిష్కృతంగా ఉన్న అనేక సమస్యలు కూడా నిధుల కోసం ఎదురు చూస్తున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా నుంచి రాష్ట్ర కేబినెట్‌లో కీలకంగా ఉన్న ముగ్గురు మంత్రులు చొరవ తీసుకొని ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా సీతారామ ప్రాజెక్టుకు నిధులు, కొత్తగూడెం ఎయిర్‌పోర్ట్ మంజూరు, జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటు, పర్యాటక అభివృద్ధి ప్రణాళికలపై జిల్లా వాసులు ఆశలు పెంచుకున్నారు. ఆయా అంశాలపై జిల్లా ప్రజాప్రతినిధులు దృష్టి సారించాల్సి ఉంది.



- ఆంధ్రజ్యోతిప్రతినిధి, ఖమ్మం



సమ్మె బాటలో సమగ్ర శిక్ష సిబ్బంది..

- రేపటి నుంచి 1,342 మంది విధులకు దూరం
- విద్యాశాఖ అధికారులకు నోటీసులు
- ఉమ్మడి జిల్లాలో ఆందోళనకు కార్యాచరణ

కొత్తగూడెం అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని విద్యాశాఖకు చెందిన సమగ్ర శిక్ష సిబ్బంది ఈనెల 10వ తేదీనుంచి సమ్మెబాట పట్టేందుకు సిద్ధం అయ్యారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పనిచేస్తున్న సిబ్బంది విధులకు దూరం కానున్నారు. ఇప్పటికే ఇరు జిల్లాలోని విద్యాశాఖ ఉన్నతాధికారులకు సమ్మె నోటీసులను అందజేశారు. మంగళవారం నుంచి విధులకు హాజరుకామని తేల్చి చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన 706మంది ఉద్యోగులు సమ్మె బాట పట్టనున్నారు. వీరితో పాటు ఖమ్మం జిల్లాకు చెందిన 636మంది ఉద్యోగులు సైతం ఆందోళనలో పాల్గొనున్నారు. దీనికి సంబంధించిన కార్యాచరణ పూర్తి చేశారు. ఉద్యోగులు ఇచ్చిన నిర్ణీత గడువు తేదీ వరకు ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించి తమ న్యాయమైన సమస్యలు పరిష్కరిస్తే సమ్మె ఆలోచన విరమించుకుంటామని చెబుతున్నారు.

విద్యాశాఖలో పలు పేర్లతో...

ఉమ్మడి జిల్లాలో సమగ్ర శిక్షలో పరిధిలో 2004వ సంవత్సరం నుంచి పీజీటీ, సీఆర్టీ, పీఈటీ, ఇతరత్రా సిబ్బంది (మిగతా 6వ పేజీలో)



సంస్మరణ సభలో మాట్లాడుతున్న అమర్జిత్ కౌర్

పోరాటయోధుడు
పోటు ప్రసాద్

- ఆయన మరణం ప్రజాఉద్యమాలకు తీరని లోటు
- సంస్మరణ సభలో సీపీఐ జాతీయ కార్యదర్శి కౌర్
- సమస్యలున్నంత వరకు కమ్యూనిజం ఉంటుంది
- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

6

ప్రభుత్వాలు మారినా
అవే సమస్యలు

- రైతు బంధు వస్తుందని ఓటేస్తే ఉన్న రూ.10 వేలు పోయాయి
- కమ్యూనిస్టుల పాలనలోనే ప్రజలకు సమన్యాయం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



సీపీఎం ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన



ఖమ్మంటౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు మారినా ప్రజల సమస్యలు పరిష్కారం కాలేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. ఖమ్మం నగరంలోని సెయింట్ మేరీస్ పాఠశాల ఆవరణలో సీతారాం ఏచూరి, బుద్ధదేవ్ భట్టాచార్య ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన సీపీఎం ఖమ్మం డివిజన్ కమిటీ మహాసభలో తమ్మినేని మాట్లాడుతూ ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్ప మిగిలిన గ్యారెంటీల్లో ఏ ఒక్కటీ సంపూర్ణంగా అమలు చేయలేదన్నారు. రైతుబంధు పథకం కింద ఎకరానికి రూ.15వేలు వస్తాయని ఓటువేస్తే ఉన్న రూ.10వేలు పోయాయని తమ్మినేని విమర్శించారు. ఏడాదికాలంగా రైతుభరోసా పథకం అమలు చేయడంలేదని దుయ్యబట్టారు. వ్యవసాయ కార్మికులకు రూ.12వేలు, మహిళలకు రూ.2,500, నిరుద్యోగభృతి తదితర హామీలు అమలుకు నోచుకోవడంలేదన్నారు. కమ్యూనిస్టుల పోరాట ఫలితంగా గత కేసీఆర్ ప్రభుత్వం గిరిజనులకు పోడుపట్టాలు ఇస్తే ప్రస్తుత రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మిగిలిన వారికి పట్టాలు ఇవ్వకపోగా ఉన్న భూములను లాక్కోవడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కమ్యూనిస్టుల పాలనతోనే ప్రజలకు సమన్యాయం జరుగుతుందన్నారు. శ్రీలంక తరహాలో మనదేశంలోనూ కమ్యూనిస్టుల పాలన తథ్యమన్నారు. ప్రభుత్వాలు ఇదే తరహా నిరంకుశ పాలన సాగిస్తే కమ్యూనిస్టు (మిగతా 6వ పేజీలో)



భద్రాద్రి రామాలయంలో దేవాదాయశాఖ కమిషనర్ శ్రీధర్ దంపతులు

రామయ్యను దర్శించుకున్న
దేవాదాయశాఖ కమిషనర్

- 'ప్రసాద్' పనులు, లడ్డూ తయారీ పరిశీలన

భద్రాచలం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి రామయ్యను రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ ఈ.శ్రీధర్ దర్శించుకున్నారు. దేవస్థానంలో ఆదివారం మూలవరులకు జరిగే పంచామృతాభిషేకంలో కమిషనర్ దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భద్రాద్రి రామాలయ ప్రాశస్త్యాన్ని దేవస్థానం వైదిక సిబ్బంది కమిషనర్‌కు వివరించారు. అలాగే దేవస్థానం వేద పండితులు కమిషనర్‌కు వేద ఆశీర్వచనం (మిగతా 6వ పేజీలో)

పొలం పనులకు వెళ్తూ..
అనంతలోకాలకు

- బైక్‌ను ఢీకొట్టిన లారీ.. ఇద్దరు మృతి
- మరొకరి పరిస్థితి విషమం
- అశ్వారావుపేట మండలం నారంవారిగూడెం వద్ద ఘటన
- మృతుల్లో ఒకరు ఏపీలోని ఏలూరు జిల్లా వాసి

అశ్వారావుపేట రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పనులకు బయలుదేరిన వారికి లారీ రూపంలో మృత్యువు ఎదురైంది. బైక్‌ను లారీ ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు మృతిచెందగా మరో వ్యక్తి తీవ్రంగా గాయపడి చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట మండలంలో ఆదివారం ఉదయం జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఏపీలోని ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం అంకంపాలెం సమీపంలోని నారాయణపురం గ్రామానికి చెందిన పేరాబత్తుల సాయి మనోజ్‌కుమార్ (27) భద్రాద్రి జిల్లా దమ్మపేట మండలంలోని మారప్పగూడెంలో పొలం కౌలుకు తీసుకొని వేరుశనగ సాగు చేశాడు. ఈ క్రమంలో మనోజ్‌కుమార్ పొలంలో పురుగులమందును పిచికారి చేసేందుకు తమ గ్రామానికి చెందిన మొగిలి వీరభద్రం అనే యువకుడిని, అశ్వారావుపేట మండలం పాపిడిగూడెం గ్రామానికి చెందిన బద్దె చిన్న వెంకటేశ్వర్లు(57)ను తన బైక్‌పై ఎక్కించుకుని బయలుదేరాడు. ఉదయం తొమ్మిదిన్నర సమయంలో అశ్వారావుపేట మండలంలోని నారంవారిగూడెం కాలనీ సమీపంలో రాష్ట్రీయ రహదారిపై సత్తుపల్లి వైపు నుంచి అశ్వారావుపేట వైపునకు వెళుతున్న లారీ వేగంగా వచ్చి వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ముగ్గురూ రోడ్డు పక్కన తుప్పల్లో పడిపోయారు. ప్రమాదంలో బైక్ నుజ్జునుజ్జయింది. మనోజ్‌కుమార్, బద్దె చిన్న వెంకటేశ్వర్లు ఘటనా స్థలంలోనే మృతి చెందారు. తీవ్రంగా గాయపడ్డ వీరభద్రంను అశ్వారావుపేట తరలించి ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం రాజమండ్రి తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లుగా తెలిసింది. ప్రమాద విషయం తెలుసుకున్న అశ్వారావుపేట పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించి, బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మనోజ్ కుమార్(ఫైల్)



ప్రమాద స్థలంలో చెల్లాచెదురుగా పడిపోయిన యువకులు

పోలవరం ఎమ్మెల్యే బాలరాజు పరామర్శ

రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వ్యక్తుల కుటుంబాలను ఏపీలోని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పరామర్శించారు. అశ్వారావుపేటలోని మార్చురిలో ఉంచిన మృతదేహాలను పరిశీలించి వైద్యులతో మాట్లాడారు. అనంతరం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. సానుభూతిని తెలిపారు.

దారితప్పిన ఖాకీ

- అక్రమార్కులతో చెట్టాపట్టాల్
- ఎస్ఐ రమ్మంటున్నారని బెదిరింపులు
- అంతా తానై చక్రం తిప్పుతున్న కానిస్టేబుల్
- ఉన్నతాధికారులకు తలనొప్పిగా మారిన పోలీసు వ్యవహారం

7

త్రీఫేజ్ విద్యుత్, సాగునీటి సమస్యలను ప్రస్తావిస్తా

భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు



భద్రాచలం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ నియోజకవర్గమైన భద్రాచలం అసెంబ్లీ పరిధిలో త్రీఫేజ్ విద్యుత్తు, సాగునీటి సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తా. వాజేడు మండలంలో మోడికుంట ప్రాజెక్టు నిర్మాణంతోపాటు వెంకటాపురం మండలంలో పాలెంవాగు, చర్లలో తాలిపేరు ప్రాజెక్టుల్లో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వం దృష్టికి తెస్తా. అదేవిధంగా దుమ్ముగూడెం మండలంలో ప్రగళ్లపల్లి ఎత్తిపోతల పథకం గురించి సభ దృష్టికి తెస్తా. ఎత్తిపోతల పథకం సమస్యలు తీరితే సాగునీటి చింత ఏజెన్సీవాసులకు తీరుతుంది. అలాగే త్రీఫేజ్ విద్యుత్తు సౌకర్యంతో రైతులకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

రెండు నూతన మండలాల ఏర్పాటు

ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య



ఇల్లెందు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇల్లెందు నియోజకవర్గంలోని భూములకు సీతారామ ప్రాజెక్టు జలాలు అందించలని, నూతనంగా ఇల్లెందు రెవెన్యూ డివిజన్‌తోపాటు కొమరారం, బోడు గ్రామాల కేంద్రాలుగా రెండు నూతన మండలాలు ఏర్పాటు చేయాలని శాసనసభలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాను. గోదావరి పరీవాహక ప్రాంతాల నియోజకవర్గాలకు సీతారామ ప్రాజెక్టు ద్వారా తొలుత సాగునీరివ్వాలని ప్రభుత్వాన్ని కోరనున్నట్లు తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని టేకులపల్లి, ఇల్లెందు మండలాల్లో భౌగోళికంగా గ్రామాలు సుదూరంగా ఉన్నాయని, మండల కేంద్రాలకు అనేక వ్యయప్రయాసలకోర్చి చేరుకుంటున్నారని అన్నారు. అందువల్ల బోడు, కొమరారం కేంద్రాలుగా రెండు నూతన మండలాలతోపాటు ఇల్లెందులో రెవెన్యూ డివిజన్ కేంద్రం ఏర్పాటు చేయాలని అసెంబ్లీలో కోరుతానన్నారు. నవోదయ కేంద్రీయ విద్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం దృష్టికి శాసనసభలో తీసుకెళ్తానని అన్నారు.

ప్రజా సమస్యలపై ప్రస్తావిస్తా..

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



కొత్తగూడెం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్య, వైద్యరంగాలతోపాటు వ్యవసాయ రైతు రుణమాఫీపై అసెంబ్లీలో చర్చిస్తానని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. రుణమాఫీతోపాటు రైతు భరోసా సాగునీరు ప్రాజెక్టు ఏర్పాటు తదితర ప్రధానమైన సమస్యలను చర్చించి వాటి పరిష్కారానికి చొరవచూపుతానని తెలిపారు. ఈ నెల 9వ తేదీ నుంచి జరగబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రస్తావిస్తానని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.2లక్షల్లోపు రైతు రుణమాఫీపై స్పష్టత ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతానని, అదేవిధంగా ఇందిరమ్మ ఇళ్ల, రేషన్‌కార్డుల జారీ, సన్నబియ్యం పథకం ప్రస్తావిస్తానని, ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలపై ప్రస్తావిస్తానని తెలిపారు. ఇతర ప్రధాన అంశాలను వాయిదా తీర్మానం ప్రవేశపెట్టేందుకు ప్రశ్నించనున్నట్లు తెలిపారు.



అధ్యక్షా ఆలకించరూ..!

- ఉమ్మడి జిల్లాలో అపరిష్కృతంగా అనేక సమస్యలు
- నిధుల లేమితో నత్తనడకన సీతారామ ప్రాజెక్టు పనులు
- అపరిష్కృతంగానే 'ఐదు' పంచాయతీల సమస్య
- రాష్ట్ర క్యాబినెట్‌లో జిల్లా నుంచి ముగ్గురు మంత్రులు
- ఎమ్మెల్యేలంతా అధికార పార్టీవారే..
- మంత్రులు చొరవ చూపితేనే సమస్యలకు పరిష్కారం

ఖమ్మం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతిప్రతినిధి):అసెంబ్లీ శీతాకాల సమావేశాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తి కావడంతో ఈసారి జరిగే అసెంబ్లీ సమావేశాలు వాడీవేడిగా సాగే అవకాశం ఉంది. గడిచిన ఏడాదిలో కొన్ని సమస్యలు పరిష్కారమైనా ముఖ్యమైన కొన్ని సమస్యలు పరిష్కారం కాలేదు. రాష్ట్ర కేబినెట్‌లో జిల్లా నుంచి డిప్యూటీ సీఎంగా భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖ మంత్రిగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తుండడంతో సమస్యల పరిష్కారంపై జిల్లా ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఈ ముగ్గురు మంత్రులు ప్రభుత్వంలో ప్రధాన పాత్ర పోషిస్తుండడంతో అసెంబ్లీలో జిల్లా ఎమ్మెల్యేలు లేవనెత్తి సమస్యల పరిష్కారానికి మంత్రులు భరోసా ఇవ్వాల్సి ఉంటుంది. కాంగ్రెస్ హామీలు ఇంకా అమలు చేయకపోవడాన్ని మిత్రపక్షంగా ఉన్న సీపీఐతో పాటు ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. రైతులు, కార్మికులు, ఉద్యోగులు వివిధవర్గాల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించేందుకు సీపీఐ పక్షాన కూనంనేని సిద్ధమయ్యారు. జిల్లాకు చెందిన సమస్యలను బీఆర్ఎస్, బీజేపీ నేతలు తమ పార్టీనేతల ద్వారా అసెంబ్లీలో విన్నవించేందుకు సిద్ధమయ్యారు.

యూనివర్శిటీ ఏర్పాటు

ఉమ్మడి జిల్లాలో యూనివర్శిటీ లేదు. ఈనేపథ్యంలో ఖమ్మం కేంద్రంగా యూనివర్శిటీ ఏర్పాటు చేస్తే ఉమ్మడి జిల్లాకే కాకుండా పొరుగున ఉన్న సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలకు ప్రయోజనం కలగనుంది. కొత్తగూడెంలోని కాకతీయ యూనివర్శిటీ ఇంజనీరింగ్ కాలేజీని సైన్స్ యూనివర్శిటీగా మార్చాలన్న ప్రతిపాదన ఉంది.

సీతారామ ప్రాజెక్టుకు నిధుల సమస్య..

ఉమ్మడి జిల్లాలో సీతారామ ప్రాజెక్టుకు నిధులు కేటాయింపు, పనులు నత్తనడకన సాగుతున్నాయి.ఇటీవల ఈ ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని రూ.19,400కోట్లకు పెంచారు. పాలేరు లింక్ కెనాల్ పనులు, సత్తుపల్లి యాతాలకుంట ట్రంక్ పనులుకు నిధులు కావాల్సి ఉంది. భూసేకరణకు కూడా నిధులు విడుదల చేయాల్సి ఉంది. జూలూరుపాడు వద్ద నిర్మించే ట్రంక్‌కు కూడా భూసేకరణకు నిధులు కావాలి.

ఎయిర్‌పోర్టుకు మోక్షం లభించేనా..?

కొత్తగూడెం కేంద్రంగా ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ఉంది. దీనికి 900ఎకరాల భూమి కేటాయించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా వేగంగా భూసేకరణ చేయాల్సి ఉంది. కొన్నేళ్లుగా ఆశలపల్లికీలో ఉన్న ఈ ఎయిర్‌పోర్టు ఏర్పాటు అంశం ఈసారైనా కొలిక్కి రావాలని జిల్లా ప్రజలు కోరుకుంటున్నారు.

పర్యాటక అభివృద్ధికి నిధులు

ఖమ్మం జిల్లాలో పాలేరు నుంచి పర్ణశాల వరకు సుమారు రూ.80కోట్లతో పర్యాటక అభివృద్ధికి ప్రతిపాదనలు చేశారు. ఖమ్మం ఖిల్లా, నేలకొండపల్లి బౌద్ధస్థూపం, భక్తరామదాసు నివాసం, ఖమ్మంలోని వెలుగుమట్ల అర్బన్‌పార్కు, వైరా రిజర్వాయర్, పాలేరు రిజర్వాయర్, పెనుబల్లి పులిగుండాల అడవులు, జమలాపురం ఆలయం, మధిరలో ట్యాంక్‌బండ్, కిన్నెరసాని, భద్రాచలంతో పాటు పలుచోట్ల పర్యాటక ప్రదేశాల అభివృద్ధికి సుమారు రూ.80కోట్లతో ప్రతిపాదనలు చేశారు. మంజూరు కూడా ఇచ్చారు. అయితే ఆర్థికశాఖనుంచి నిధులు విడుదల కావాల్సి ఉంది.

అపరిష్కృతంగానే ఐదు పంచాయతీల సమస్య

తెలంగాణ-ఆంధ్రా సరిహద్దులో భద్రాచలానికి సమీపంలో ఏపీ పరిధిలోఉన్న యటపాక, కన్నాయిగూడెం, పిచుకులపాడు, గుండాల, పురుషోత్తపట్నం పంచాయతీలను తెలంగాణలో కలపాలనే డిమాండ్ ఉంది. ఈ విషయంపై ఇరురాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో చర్చ కూడా జరిగింది. కానీ ఈ సమస్య అపరిష్కృతంగానే ఉంది.

భద్రాద్రి ఆలయ అభివృద్ధి

రాష్ట్రంలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా ఉన్న భద్రాచలం దేవస్థానం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే భూసేకరణ కోసం రూ.60కోట్లు మంజూరు చేసింది. దక్షిణ అయోధ్యగా పేరు పొందిన ఈ ఆలయ అభివృద్ధిలో భాగంగా గోదావరిలో రివర్‌బోటింగ్, రివర్‌టూరిజం, విశ్రాంతి గృహాలు పర్యాటకులు, భక్తులను అలరించేలా పలు నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. దీనికి నిధుల కేటాయించాల్సిన అవసరం ఉంది.

మౌలిక సదుపాయాలు కల్పన

జిల్లాలో పలుచోట్ల రహదారుల అభివృద్ధికి, వారధుల నిర్మాణానికి నిధులు కేటాయించాలి. ఇటీవల కురిసిన వర్షాలు, వరదలతో పలుచోట్ల బ్రిడ్జిలు కొట్టుకుపోయాయి. జిల్లాలో రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణానికి సుమారు రూ.వెయ్యి కోట్ల నిధులు కావాల్సి ఉంది. అలాగే బోనకల్-కొత్తగూడెం, ఖమ్మంకలెక్టరేట్ నుంచి వైరాకు నాలుగులైన్ల రహదారిని నిర్మించాలన్న డిమాండ్ ఉంది.

రుణమాఫీ సమస్య

ఉమ్మడిజిల్లాలో రూ.2లక్షలలోపు ఉన్న రైతురుణాలు మాత్రమే మాఫీ అయ్యాయి. రూ.2లక్షల పైన ఉన్న రైతులకు రుణమాఫీ జరగలేదు. దీంతో ఆయా రైతులు మాఫీ కోసం ఎదురు చూస్తున్నారు. జిల్లాలో రూ.2లక్షల పైన ఉన్న రుణాలతోపాటు కుటుంబ నిర్ధారణ కాని రుణాలకు సంబంధించి మొత్తం 10వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటి పరిష్కారానికి కూడా చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ఇందిరమ్మ ఇళ్లకు ఏజెన్సీ సమస్య

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో షెడ్యూల్ ఏరియా ప్రాంతంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలంటే ఏజెన్సీ సమస్య తలెత్తే అవకాశం ఉంది. ఇల్లు మంజూరుతో పాటు ఇళ్లస్థలం కేటాయింపునకు కూడా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. అంతే కాకుండా సీతారామతోపాటు పలు సాగునీటి అవసరాలు, రహదారుల అవసరాలకు భూసేకరణ జరుగుతున్న తరుణంలో గిరిజనేతర రైతుల భూములకు పట్టాలు లేకపోవడంతో పరిహారం పూర్తిస్థాయిలో అందండం లేదు. వారికి మొక్కుబడిగానే పరిహారం అందిస్తున్నారు. పట్టాలేని రైతులకు కూడా పరిహారం చెల్లించే విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది.

భూ సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తా

డాక్టర్ మట్టా రాగమయి, సత్తుపల్లి ఎమ్మెల్యే



సత్తుపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి):సత్తుపల్లి నియోజకవర్గంలోని పెనుబల్లి, కల్లూరు మండలాల్లోని పలు గ్రామాల్లో కస్టోడియన్ భూములు సాగు చేసుకుంటున్న రైతులకు గత ప్రభుత్వంలో హక్కు పత్రాలు ఇవ్వకపోవటంతో రైతులకు అప్పట్లో రుణమాఫీ కాలేదు. కస్టోడియన్ భూములకు హక్కు పత్రాలు ఇచ్చేందుకుగాను సమస్యను అసెంబ్లీలో ప్రస్తావిస్తా. బేతుపల్లి, లంకాసాగర్, చల్లసముద్రం చెరువు ఆధునికీకరణకు నిధుల కోసం అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరుతా. ప్రధాన పంట కాలువల మరమ్మతులకు నిధులకోసం చర్చిస్తా. సింగరేణి సంస్థ యువతకు నైపుణ్య అభివృద్ధి కేంద్రాల ఏర్పాటుకు, బుగ్గపాడు ఫుడ్ పార్కులో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అసెంబ్లీలో మాట్లాడతా.

రైతు భరోసా, రుణమాఫీ గురించి ప్రస్తావిస్తా

ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్



వైరా, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాల్లో రైతు భరోసా, రూ.రెండులక్షల రుణమాఫీ అంశాలను ప్రస్తావిస్తా. సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం బోనస్ ఇవ్వడంతో రైతులు సంతృప్తి వ్యక్తంచేస్తున్న విషయాన్ని కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి అభినందనలు తెలుపుతా. అదే క్రమంలో ఇప్పటివరకు నాలుగు విడతల్లో జరిగిన రుణమాఫీ మాదిరిగానే మిగిలిన రైతులకు కూడా విడతల వారీగా రూ.రెండులక్షల రుణమాఫీ అమలు, సకాలంలో రైతు భరోసా చెల్లించే అంశాన్ని సమావేశాల్లో ప్రస్తావిస్తా. వైరా నియోజకవర్గంలో వందపడకల ఆసుపత్రి, ఇంటిగ్రేటెడ్ నిర్వహణ 2025లో పూర్తి చేసే విధంగా నిర్మాణాలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరతాను. సీతారామ ప్రాజెక్టు ద్వారా నియోజకవర్గంలోని అన్ని మండలాలకు గోదావరి జలాలను 2026నాటికి సరఫరా చేసే విధంగా ప్రభుత్వాన్ని ఒప్పించేలా సమావేశాల్లో మాట్లాడతా.

ఇరిగేషన్ ప్రాజెక్టులపై అసెంబ్లీలో ప్రస్తావిస్తా..

ఎమ్మెల్యే జారే ఆదినారాయణ



అశ్వారావుపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ఇరిగేషన్ ప్రాజెక్టులు, అభివృద్ధి, మరమ్మతులు, టూరిజం ప్రాంతాలుగా అభివృద్ధి చేయాలనే కృతనిశ్చయంతో ఉన్నానని, ఈ అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావిస్తానని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తెలిపారు. సోమవారం నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే వ్యవసాయ సీజన్‌లో రైతులకు ఉపయోగపడేలా జలాశయాలు, చెరువుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్ళనున్నట్టు తెలిపారు. వీటితోపాటు విద్య, వైద్యం, మౌలిక వసతులకు నిధులు మంజూరు విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్టు ఆయన తెలిపారు.

సమ్మె బాటలో సమగ్ర శిక్ష సిబ్బంది..

(5వ పేజీ తరువాయి)

పనిచేస్తున్నారు. విద్యాశాఖలో జిల్లాస్థాయిలో ఏపీవోలు, డీపీవోలు, సాంకేతిక నిపుణులు, సిస్టమ్ అనాలసిస్ సిబ్బంది పేర్లతో పనిచేస్తున్నారు. మండల స్థాయిలో కంప్యూటర్ సహాయకులు, ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సేవలు అందించే భవిత కేంద్రాల్లో ఉపాధ్యాయులు, రిసోర్స్‌పర్సన్లు, పాఠశాల స్థాయిలో అర్ట్, క్రాఫ్ట్, పీఈటీలు, సహాయకులు, కేజీబీవీల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ప్రత్యేక అధికారులు, ఏఎన్ఎంలు, పీఈటీలు, అకౌంటెంట్లు, కంప్యూటర్ సహాయకులు, వంట పనిచేసేవారు, వాచ్‌మెన్లు, స్వీపర్లు, స్కావెంజర్లు పనిచేస్తున్నారు. వీరంతా సమ్మెలోకి వెళితే విద్యాశాఖ ప్రగతిపై ప్రభావం పడనుంది.

ప్రధాన సమస్యలివే...

సమగ్రశిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, అప్పటివరకు పేస్కేల్ కల్పించి, ప్రతి ఉద్యోగికి రూ.20లక్షల జీవిత బీమా, రూ.10లక్షల ఆరోగ్య బీమా అమలు చేయాలని, సమగ్ర శిక్ష ఉద్యోగులకు పదవి విరమణ ప్రయోజనాల కింద రూ. 25లక్షలు చెల్లించాలని, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో వెయిటేజ్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

పరిష్కరించేవరకు పోరాడుతాం

బి. మోహన్, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు

ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీతో సానుకూల స్పందన వస్తుందని ఆశిస్తున్నాం. లేనిపక్షంలో న్యాయమైన డిమాండ్ల ను పరిష్కరించేవరకు సమ్మెను ఉధృత్తం చేస్తాం. ఈనెల 10 నుంచి ఉద్యోగులు ఎవరూ కార్యాలయాలకు, విధులకు హాజరుకారు.

రామయ్యను దర్శించుకున్న దేవాదాయశాఖ కమిషనర్

(5వ పేజీ తరువాయి)

అందజేశారు. దేవస్థానం తరపున స్వామివారి ప్రసాదం, కండువా, జ్ఞాపికను ఈవో రమాదేవి వారికి అందజేశారు. పూజల అనంతరం ఆలయంలో లడ్డూ, పులిహోర ప్రసాదాల తయారీ కేంద్రాన్ని కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రసాదాల తయారీ వివరాలను ఈవో రమాదేవి వివరించారు. దేవస్థానానికి ఏటా వస్తున్న ఆదాయం, వ్యయాలు తదితర ఆర్థిక అంశాలను సైతం కమిషనర్‌కు ఆమె వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో దేవస్థానం పరిసరాల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులను వివరించారు. 31నుంచి భద్రాద్రి దేవస్థానం ఆధ్వర్యంలో వైకుంఠ ఏకాదశి మహోత్సవాలు ప్రారంభం కానుండటంతో వాటికి సంబంధించిన పనులను, ఉత్తద్వార దర్శన ప్రాంతాన్ని కమిషనర్ పరిశీలించారు. అలాగే మిథిలా స్టేడియంలో కేంద్ర ప్రభుత్వం 'ప్రసాద్' పథకం కింద చేపడుతున్న గాల్వాలియం షెడ్ల పనులను కూడా ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, ఏఈవోలు వి.శ్రవణ్‌కుమార్, భవానీ రామకృష్ణారావు, ఈఈ వి.రవీంద్రనాథ్, ప్రధాన అర్చకులు అమరవాది విజయరాఘవన్, కోటి రామస్వరూప్ రాఘవచార్య, వైదిక, పరిపాలన సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వాలు మారినా అవే సమస్యలు

(5వ పేజీ తరువాయి)

పాలన రావడం తథ్యమన్నారు. విద్యా, వైద్యం, ఉపాధి, సామాజిక న్యాయం తదితర అంశాల్లో ప్రభుత్వమే సమకూర్చాల్సి ఉండగా, బూర్జువాపార్టీలు వీటిని ప్రైవేటు చేతిలో పెడుతున్నాయన్నారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎంఏ జబ్బార్, దొంగల తిరుపతిరావు, ఎస్.నవీన్‌రెడ్డి, నాగ సులోచన అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.సాయిబాబు, పోతినేని సుదర్శన్‌రావు ప్రసంగించారు. జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పలు తీర్మానాలు ప్రవేశపెట్టారు. ఈ మహాసభలో 25మందితో ఖమ్మం డివిజన్ కమిటీని ఏర్పాటు చేశారు. కార్యదర్శిగా వై.విక్రం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మహాసభకు ముందు సీపీఎం ఆధ్వర్యంలో మహిళలు కోలాట నృత్యాలు చేస్తూ ప్రదర్శన నిర్వహించారు. ఈ మహాసభలో రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, యర్రాశ్రీకాంత్, మాచర్ల భారతి, జిల్లా కార్యదర్శివర్గసభ్యులు బుగ్గవీటి సరళ, కళ్యాణం వెంకటేశ్వరరావు, భూక్యా వీరభద్రం, బండి రమేష్, బొంతు రాంబాబు జిల్లానేతలు పాల్గొన్నారు.

సముచితమే కానీ..!

(5వ పేజీ తరువాయి)

సందర్భాల్లో మహిళలకు, కండక్టర్లకు మధ్య గొడవలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం ఆధార్ కార్డు ప్రామాణికంగానే ఉచిత ప్రయాణం అందిస్తుండటంతో సమస్యలు తప్పటంలేదు. బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణమనేది ప్రభుత్వ నిర్ణయం కాబట్టి ప్రభుత్వ నిర్ణయానికి కట్టుబడి ఆర్టీసీ కండక్టర్లు పని చేయాలి. కానీ చాలామంది కండక్టర్లు తామే ఉచితంగా తీసుకెళుతున్నట్లు మహిళలను విసుక్కోవడం, కసురుకోవడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఉచిత ప్రయాణం కల్పించినా ప్రభుత్వం మహిళల వ్యతిరేకతను ఎదుర్కొనే ప్రమాదం ఉంది.

రద్దీకి తగ్గట్లు పెరగని బస్సులు

మహిళలలకు ఉచిత ప్రయాణం కల్పించిన ప్రభుత్వం బస్సుల సంఖ్యను పెంచుతామని చెప్పి ఏడాది దాటినా ఒక్క అదనపు బస్సు కూడా పెంచలేదు. పైగా ఇప్పటికే ఉన్న కొన్ని పల్లెవెలుగు సర్వీసులను తగ్గించడంతో పాటు ఎక్స్‌ప్రెస్ బస్సుల స్థానంలో కొత్తగా డీలక్స్ బస్సులను నడిపిస్తోంది. బస్సుల సంఖ్య తక్కువగా ఉండటంతో మహిళా ప్రయాణికులతో పాటు పురుషులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. ఖమ్మం నుంచి కోదాడ, బోనకల్, సూర్యాపేట, ఇల్లెందు, సత్తుపల్లి, హైదరాబాద్‌కు గతంలో ఎక్కువగా ఎక్స్‌ప్రెస్ బస్సులు అందుబాటులో ఉండేవి. కానీ ఆర్టీసీ అధికారులు ప్రస్తుతం వాటి సంఖ్యను తగ్గించి డీలక్స్ బస్సులను, సూపర్‌లగ్జరీ బస్సులను అధికంగా నడుపుతూ మహిళా ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ప్రభుత్వం మహిళలకు అందించిన ఉచిత ప్రయాణానికి అధికారులే కొర్రీలు పెడుతూ ఉన్న బస్ సర్వీస్‌లను తగ్గిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సర్వీసులు తగ్గడంతో బస్సుల్లో మహిళలకు సీట్లు దొరక్క కండక్టర్, డ్రైవర్లతో మహిళలు గొడవలు పడాల్సిన పరిస్థితి నెలకొంది.

కండక్టర్ల తీరుతో ఇబ్బందులు

వరలక్ష్మి, ప్రయాణికురాలు, ఖమ్మం



12 ఏళ్ల క్రితం తీసుకున్న ఆధార్ కార్డులనే కొంతమంది మహిళలు కండర్లకు చూపుతుండగా ఆయా కార్డుల్లో ఉన్న ఫొటోలతో ప్రస్తుతం ఉన్న వ్యక్తులు సరిపోలకపోవడం సమస్యగా మారింది. దీనికి తోడు 2014కు ముందు తీసుకున్న ఆధార్ కార్డులన్నీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పేరుతోనే ఉండటంతో కొంతమంది కండక్టర్లు టికెట్ అడుగుతున్నారు. కొన్ని సందర్భాల్లో బస్టాపుల్లో మహిళల సంఖ్య ఎక్కువగా కనిపిస్తే బస్సులను ఆపకుండా వెళ్తున్నారు. ఆర్టీసీ రిక్వెస్ట్ స్టాప్ ఉన్నా మహిళలు వేడుకున్నా బస్సు నిలవకపోవడంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నాం. మహిళలను ఇబ్బంది పెట్టకుండా డ్రైవర్లు, కండక్టర్లకు అధికారులు ఆదేశాలు ఇవ్వాలి.

సమస్యలు లేకుండా చూస్తాం

సరిరాం, ఆర్టీసీ రీజనల్ మేనేజర్



మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యంతో బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య రెట్టింపు కావటంతో సిబ్బందిపై భారం పెరిగింది. ఒత్తిడి కారణంగా వారు కొన్ని సందర్భాల్లో అసహనానికి గురయ్యే అవకాశం ఉంది. ఈ విషయంలో సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఇప్పటికే సూచనలు చేశాం. మహిళలు కూడా సిబ్బందికి సహకరించాలి. ప్రభుత్వం అందించిన పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలి. ఉమ్మడి జిల్లాలో ఎక్కడా మహిళలకు సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటాం.

పోరాటయోధుడు పోటు ప్రసాద్



నివాళులర్పిస్తున్న సీపీఐ జాతీయ కార్యదర్శి అమర్జిత్ కౌర్

ఖమ్మం, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): దివంగత కమ్యూనిస్టు నేత, సీపీఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటుప్రసాద్ పోరాట యోధుడని, రాజ్యాంగ హక్కుల కోసం పోరాడుతున్న క్రమంలో ఆయన మరణించడం దురదృష్టకరమని ఏఐటీయుసీ జాతీయ ప్రధాన కార్యదర్శి, సీపీఐ జాతీయ కార్యదర్శి అమర్జిత్ కౌర్ తెలిపారు. ఖమ్మంలోని మమత మెడికల్ కళాశాలలోనిపువ్వాడ ఆడిటోరియంలో ఆదివారం సీపీఐ జిల్లా కార్యదర్శి పోటుప్రసాద్ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సభలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ పోటు ప్రసాద్ కుటుంబం మూడు తరాల నుంచి కమ్యూనిస్టు పార్టీలో పనిచేస్తోందని, మూడో తరానికి చెందిన పోటు ప్రసాద్ విద్యార్థి, కార్మిక ఉద్యమాల్లో ఎంతో నిబద్ధతతో పని చేశారన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శిగా పనిచేస్తూ పార్టీ శ్రేణులను ప్రజాపోరాటాలకు సన్నద్ధం చేసేవారన్నారు. ప్రజాఉద్యమాల్లో పనిచేస్తూ బహుముఖ పోరాటాలకు నేతృత్వం వహించి అమరులైన వారికి ప్రజా పోరాటాల కొనసాగింపే సరైన నివాళి అన్నారు. పోటు ప్రసాద్ ఆశయ సాధనకు పునరంకితం కావాలని ఆమె పిలుపునిచ్చారు.

ప్రధాని మోదీ పాలనలో ప్రజల ఆదాయ వ్యయాల మధ్య వ్యత్యాసం పెరిగి వేతన జీవులు, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దేశ సంపద ఒక శాతం మంది వద్దనే పోగుపడుతుండడంతో 90శాతం మంది ఆర్థిక ఇబ్బందులతో ఉన్నారన్నారు. కేంద్రంలోని బీజేపీ సర్కార్ ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తూ అంబానీ, అదానీలకు సంపదను కట్టబెట్టే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు.

ప్రసాద్‌కు నివాళిగా శత వసంత ముగింపు సభ: కూనంనేని

తుదిశ్వాస వరకు నిబద్ధత, నిస్వార్థంతో కమ్యూనిస్టు పార్టీ పురోభివృద్ధికి కృషి చేసిన పోటు ప్రసాద్‌కు నివాళిగా ఖమ్మంలో సీపీఐ శత వసంతాల జాతీయస్థాయి ముగింపు సభ నిర్వహిస్తున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. లక్ష మందితో బహిరంగ సభ నిర్వహిస్తామని ప్రకటించారు. సుదీర్ఘ పోరాటాల చరిత్ర కలిగిన కుటుంబం నుంచి వచ్చిన పోటు ప్రసాద్ కమ్యూనిస్టు భావజాల వ్యాప్తిలో ముందువరుసలో నిలిచారన్నారు. ఖమ్మం జిల్లా కమ్యూనిస్టు పార్టీని ఆదర్శంగా తీర్చిదిద్దడంలో పోటుప్రసాద్ కృషి ఎనలేనిదన్నారు. గంగినేని వెంకటేశ్వరరావు రచించిన ఎర్ర జెండాల పుస్తకంలోనూ, సుందరయ్య రచించిన ఆదర్శ కుటుంబాల పుస్తకంలోనూ పోటు ఎర్రమ్మ కుటుంబానికి సముచిత స్థానం ఇవ్వడం గర్వంగా ఉందన్నారు. సమస్యలు ఉన్నంత కాలం కమ్యూనిస్టు భావజాలం వ్యాప్తి చెందుతున్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ మావోయిస్టులను తుదముట్టిస్తామని చెప్పడం అవివేకమన్నారు. ప్రసాద్ మరణంతో ఓ విప్లవ గొంతుక మూగబోయిందని ప్రసాద్ స్ఫూర్తితో భవిష్యత్ కార్యాచరణతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

సభలో సీపీఐ సీనియర్ నాయకుడు పువ్వాడ నాగేశ్వరరావు, తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి, కొండబాల కోటేశ్వరరావు, గుమ్మడి నర్సయ్య, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్, ఏపీ సీపీఐ నాయకులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, వనజ, కాంగ్రెస్ నాయకులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, తుమ్మల యుగంధర్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పల్లా పద్మ, బాగం హేమంతరావు, నాయకులు పోట్ల మాధవరావు, జర్నలిస్టు సంఘాల నాయకులు కె. రాంనారాయణ, ఎ. ఆదినారాయణ తదితరులు ప్రసంగించారు. గిడ్డంగుల కార్పోరేషన్ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, సీపీఐ నాయకులు ఎస్. షాబీర్ పాషా, మహ్మద్ మౌలానా, బి. అయోధ్య, ప్రసాద్ కుమారుడు రాజా సాత్విక్, సతీమణి పోటు నిర్మల, తల్లి సక్కుబాయి, సోదరి పోటు కళావతి తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్ పనులు ప్రారంభం



సెంట్రల్ లైటింగ్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

దమ్మపేట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): దమ్మపేట మండల కేంద్రంలో రూ.5కోట్లతో చేపడుతున్న సెంట్రల్ లైటింగ్ పనులను ఎట్టకేలకు ప్రారంభించారు. సంవత్సర కాలంగా సెంట్రల్ లైటింగ్ పనుల నత్తన నడకన సాగుతున్నాయి. ఎమ్మెల్యే జారే ఆదినారయణ కృషితో ఆదివారం సెంట్రల్ లైటింగ్ పనులను కాంట్రాక్టర్ ప్రారంభించారు. స్తంభాలు ఏర్పాటు చేసి లైట్లు బిగించే పనులను చేపట్టారు.


సెంట్రల్‌లైటింగ్ పనులను ఎమ్మెల్యే జారే ఆదివారం సాయంత్రం పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సెంట్రల్‌లైటింగ్ పనులనుత్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

12న ఏక సభ్య కమిషన్ ఖమ్మానికి రాక

- జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి అనసూర్య

చుంచుపల్లి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఈ నెల 12వ తేదీన ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏక సభ్య విచారణ కమిషన్ ఖమ్మానికి రానున్నట్లు భద్రాద్రి జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి అనసూర్య ఆదివారం తెలిపారు. ఈ విచారణ కమిషన్ డాక్టర్ జస్టిస్ షమీం అక్తర్ షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణపై వివరణాత్మక అధ్యాయనం కోసం ఉమ్మడి ఖమ్మం జిల్లా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిధిలో బహిరంగ విచారణకు వస్తున్నట్లు పేర్కొన్నారు. కావునా భద్రాద్రి జిల్లాలోని ఎస్సీ కులాల సంఘం నాయకులు అధిక సంఖ్యలో బహిరంగ విచారణ హాజరు కావాలన్నారు. ఖమ్మం ఐడీవోసీ కార్యాలయంలో వినతులను అందజేయాలని సూచించారు.

దారి తప్పిన ఖాకీ



- అక్రమార్కులతో చెట్టాపట్టాల్
- ఎస్ఐ రమ్మంటున్నారని బెదిరింపులు..
- అంతా తానై చక్రం తిప్పుతున్న కానిస్టేబుల్
- ఉన్నతాధికారులకు తలనొప్పిగా మారిన పోలీసు వ్యవహారం

బూర్గంపాడు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తించే ఓ కానిస్టేబుల్ తీరు వివాదస్పదంగా మారుతోంది. మండల పరిధిలో ఇసుక, మట్టి దందా చేసే వారిని గత కొంత కాలంగా ఎస్ఐ ఎస్ఐ సార్ కలువమంటున్నారు వచ్చి కలిసి వెళ్లండి అంటూ హుకూం జారీ చేస్తున్నాడు. పోలీస్‌స్టేషన్‌కు కేసుల విషయమై వచ్చే ఫిర్యాదుదారుల నుంచి మొదలుకుని చిన్నా చితక కేసుల వరకు అంతా తానే చక్రం తిప్పుతున్నట్లు వినికిడి. పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ప్రత్యేక హంగులతో ఓ గదిని ఏర్పాటు చేసుకుని సెటిల్‌మెంట్‌లు చేస్తున్నట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు.

నాతో మాట్లాడితే చాలు...

పోలీస్‌స్టేషన్‌లో ఏం పని ఉన్నా వచ్చి నన్ను కలిసి నాతో మాట్లాడండి.. సార్‌తో మాట్లాడినట్లే అంటూ భరోసా కల్పిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. సదరు కానిస్టేబుల్‌ను కలిస్తే బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌లో కాని పని అంటూ ఏది లేదని పలువురు పేర్కొంటున్నారు. ఇదేమిటని ప్రశ్నించిన వారిపై నాకు ఉద్యోగం అవసరం లేదు....ఇక్కడ కాకుంటే మరో చోట ఉద్యోగం చేసుకుంటా అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నట్లు పలువురు బాధితులు పేర్కొంటున్నారు. పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించే సీనియర్ అధికారులు, సిబ్బంది సైతం సదరు కానిస్టేబుల్ వ్యవహరించే తీరు పట్ల అసహనం వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే కానిస్టేబుల్ తీరుపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది.

సెటిల్‌మెంట్లకు ప్రత్యేక గది..

సదరు కానిస్టేబుల్ బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో అత్యాధునిక హంగులతో గదిని ఏర్పాటు చేసుకున్నట్లు స్థానికులు అనుకుంటున్నారు. అందులో సెటిల్‌మెంట్‌లకు పాల్పడున్న కానిస్టేబుల్ ఆగడాలు రోజు రోజుకూ శ్రుతిమించిపోతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. రాత్రి వేళల్లో బూర్గంపాడు మండలం మీదుగా పీడీఎస్ బియ్యం తీసుకవెళ్లే వాహనాలను మండల సరిహద్దు దాటించడంలో సదరు కానిస్టేబుల్ దిట్ట అని వినికిడి. అక్రమార్కులతో కలిసి సెటిల్‌మెంట్లు చేస్తున్నాడని తెలుస్తోంది.

అధికారులకు తలనొప్పి..

ఇప్పటికే బూర్గంపాడు పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ పనితీరుపై ఉన్నాతాధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినప్పటికీ, అయినా మార్పు రాకపోవడం అధికారులకు తలనొప్పిగా మారినట్లు తెలుస్తోంది. ఇప్పటికే బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌లో పని చేసిన పలువురు కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లు అవినీతి ఆరోపణలు ఎదుర్కొని సస్పెండ్ కావడం, బదిలీలు అవడం, హెడ్‌క్వార్టర్స్‌కు ఎటాచ్‌మెంట్ అయిన సందర్భాలు ఉన్నాయి. అయినా సిబ్బంది తీరులో మార్పు రాకపోవడం పట్ల తీవ్ర అక్షేపణలు వ్యక్తమవుతున్నాయి. అక్రమ వసూళ్లకు పాల్పడుతూ బూర్గంపాడు పోలీస్‌స్టేషన్ ప్రతిష్టకు భంగం కల్గిస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు వేడుకుంటున్నారు.

విచారణ చేసి చర్యలు తీసుకుంటాం
వినయ్‌కుమార్, పాల్వంచ సీఐ

బూర్గంపాడు పోలీస్‌స్టేషన్ సిబ్బంది తీరుపై నిఘా ఏర్పాటు చేస్తాం. విధులు పట్ల నిర్లక్ష్యంగా వ్యవరించి అక్రమాలకు పాల్పడితే విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలు

- సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్రబాబు



మాట్లాడుతున్న ఎస్‌జీపీఏటీ రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్రబాబు

ఖమ్మం సాంస్కృతికం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలు నిర్మిస్తామని ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (ఎస్‌జీపీఏటీ) రాష్ట్ర అధ్యక్షుడు అరివిణి రాజేంద్రబాబు అన్నారు. ఆదివారం ఖమ్మంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పరిశ పుల్లయ్య అధ్యక్షతన సంఘం జిల్లా సదస్సు జరిగింది. ఈ సందర్భంగా రాజేంద్రబాబు మాట్లాడుతూ పెన్షన్ దారుల పట్ల ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరించటంలేదన్నారు. సమస్యల పరిష్కారానికి ఆందోళన బాట పడతామని, త్వరలో ఇందుకు సంబందించిన పోరాట కార్యాచరణను ప్రకటిస్తామని చెప్పారు. తమసమస్యలు ఎన్నిసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ప్రభుత్వం నాన్చుతోంది తప్ప పరిష్కరింటంలేదన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా పెన్షన్‌దారుల సమస్యలు తీరటం లేదని చెప్పారు. నాలుగు విడతలుగా పెండింగ్ లోఉన్న డీఏలు, నగదు రహితహెల్త్ స్కీం , పీఆర్సీ, స్పెషల్ టీచర్ల 398 సమస్య తదితర డిమాండ్ల సాధన కోసం పెన్షనర్లు సుదీర్ఘంగా పోరాటలుసాగిస్తున్నారని చెప్పారు. రిటైరైన అయిన వారికి చెల్లించాల్సిన బెనిఫిట్లను ప్రభుత్వం చెల్లించటం లేదన్నారు. ఈకుబేర్ యాప్ ద్వారా రిటైర్డ్ ఉద్యోగులు నమోదు చేసుకోవాల్సి ఉండటం కష్ట సాధ్యంగా మారుతోందన్నారు.

హెల్త్ కార్డులు పనిచేయక పోతుండటంతో రిటైర్డ్ ఉద్యోగులుఎప్పుడు ఎటువంటి ఆరోగ్య సమస్యల పాలవుతామోనని ఆందోళనలకు గురవుతున్నారని చెప్పారు. రిటైర్డ్ ఉద్యోగులను ప్రభుత్వాలు భారంగా భావిస్తుండటం వల్లే సమస్యలు తీరటంలేదని ఆయన ఆరోపించారు. పెన్షనర్ల సంఘం పెన్షనర్ల ఆత్మగౌరవ నినాదం ప్రతీకగా ఏర్పడిందన్నారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంవీ నర్సింగరావు మాట్లాడుతూ.. పెనషనర్ల న్యాయపరమైన డిమాండ్ల సాధనకు కలిసికట్టుగా ఉద్యమించాలని అన్నారు. ఉద్యమాలకు పోరాటాలకు నిలయమైన ఖమ్మం జిల్లా పెన్షనర్ల సంఘం పోరాటానికి దిక్సూచీగా నిలవాలన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి. రాం మనోహర్, దేశ్ పాండే, జిల్లా నాయకులు కె. కృష్ణమూర్తి, ఆళ్ల రామారావు, రాయల రవికుమార్, భాస్కర్ చారి, శరత్ బాబు తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎస్‌జీ పీఏటీ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు.

రామాలయం నిర్మాణానికి భూమిపూజ



ఎమ్మెల్యే జారేను సత్కరిస్తున్న యుగంధర్

దమ్మపేట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): గండుగులపల్లి గ్రామంలో కోదండ రామాలయం పునఃనిర్మాణానికి దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఆదివారం భూమి పూజ నిర్వహించారు. ఈకార్యక్రమంలో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు యుగంధర్, తుమ్మల సతీమణి భ్రమరాంబ, ఉమ్మడి ఖమ్మం జిల్లా దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ వీరస్వామి రామాలయ నిర్మాణ భూమిపూజ కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు. అనంతరం రామాలయ ఆలయ నిర్మాణ ప్రాంగణంలో హోమం,పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా రామాలయనిర్మాణం శిలాఫలకాన్ని ఎమ్మెల్యే జారే తుమ్మల యుగంధర్‌తో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే జారే ఆదినారాయణను, అసిస్టెంట్ కమిషనర్ వీరస్వామి, అర్చకులు ప్రసాద్ శాస్త్రిని తుమ్మల యుగంధర్ సత్కరించారు. ఈకార్యక్రమంలో యలమంచి చిట్టిబాబు, జాస్తి కన్నయ్య బాబులక్ష్మి, ఎర్రా కిరణ్‌కుమార్‌నమృత, నరుకళ్ల రామారావు, నరకుళ్ల చెన్నారావు, ఎలమంచి చిట్టిబాబు, పైడి వెంకటేశ్వరరావు, ఎర్రా వసంతరావు, కాసాని నాగప్రసాదు, కూకులకుంట జగపతిరావు, తుమ్మల శంకర్రావు, మడకం రాజేష్, డీఈ రమేష్‌బాబు, తుమ్మల శేషుబాబు, రాంబాబు, తుమ్మల చెన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

భూమి దానం .. గండుగులపల్లిలో నిర్మిస్తున్న రామాలయ నిర్మాణానానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోదరుడు తుమ్మల చెన్నారావు జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు వాణి, జాస్తి కన్నయ్యబాబు లక్ష్మి, ఎర్రా కిరణ్‌కుమార్‌నమృతలు 250 గజాల స్థలాన్ని దానంగా అందజేశారు.



వనజీవి రామయ్యను ఆహ్వానిస్తున్న ఉపాధ్యాయుడు మహమూద్‌పాషా

మొక్కలు నాటాలని రామయ్యకు ఆహ్వానం

అశ్వాపల్లి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) పద్మశ్రీ గ్రహీత వనజీవి రామయ్యను ఆదివారం డబ్ల్యూవోటీఏస్ గ్రీన్ రేంజర్ కో-ఆర్డినేటర్, అశ్వాపల్లి మండలం, జాకారం ఎంపీపీఎస్ పాఠశాల ఉపాధ్యాయుడు, షేక్‌మహమూద్ పాషా కలిశారు. రామయ్య దంపతులను సన్మానం చేసి, అశ్వాపల్లి మండలం, జాకారం పాఠశాల, గ్రామంలో పంచ దేవత మొక్కలను నాటేందుకు రావాలని వనజీవి రామయ్యను ఆహ్వానించారు.

రాష్ట్రస్థాయి ఈత పోటీల్లో
కొత్తగూడేనికి నాలుగు పతకాలు

లక్ష్మీదేవిపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఈత పోటీల్లో కొత్తగూడెం విద్యార్థులు ప్రతిభచాటారు. శని, ఆదివారాల్లో భూపాలపల్లి జిల్లాలో నిర్వహించిన ఈతపోటీల్ల కొత్తగూడెం నవభారత్ పాఠశాలకు చెందిన కొట్టె సాయి శ్రీ వాత్సవ్‌కు బ్యాక్ స్ట్రోక్ 200మీటర్ల, బ్రేస్ట్ స్ట్రోక్ 200 మీటర్ల విభాగంలో రెండు కాంస్య పతకాలు, బండారి నాగచైతన్య, బటర్‌ఫ్లై 200మీ. విభాగంలో ఒక కాంస్య పతకం సాధించారు. సెయింట్‌జోసెఫ్ పాఠశాలకు చెందిన చత్రపతి నాథ్‌కు బటర్‌ఫ్లై విభాగంలో 200మీ. పోటీలో రజత పతకం సాధించారు. విజేతలను నవభారత్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎంవీఎస్ రెడ్డి, సెయింట్ జోసెఫ్ ప్రిన్సిపాల్ రాజశేఖర్‌రెడ్డి, స్విమ్మింగ్ ఫుల్‌కోచ్‌లు హనుమంతరాజు, శామ్యూల్, సంధ్య, రాంబాబు, సామంతు అభినందించారు.



పతకాలు సాధించిన కొత్తగూడెం విద్యార్థులు

క్రైం సమాచారం

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

దుమ్ముగూడెం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గౌరారం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల పదోతరగతి విద్యార్థిని ఆదివారం తన ఇంటి వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. తోగ్గూడెం గ్రామానికి చెందిన సదరు విద్యార్థిని ఈనెల 7న ఆశ్రమ పాఠశాలలో అనారోగ్యానికి గురవడంతో పర్ణశాల పీహెచ్‌సీకి తరలించారు. అనంతరం ఆమెను తల్లిదండ్రులు ఇంటికి తీసుకెళ్లారు. ఆదివారం గ్రామంలోని ఒక దినకార్యక్రమానికి హాజరైన బాలిక అనంతరం ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన తల్లిదండ్రులు తొలుత దుమ్ముగూడెం పీహెచ్‌సీలో చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. విద్యార్థిని పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ విషయమై హెచ్‌ఎం మోతీరు మాట్లాడుతూ, రక్తపు వాంతులు కావడంతో బాలికను ఈనెల 7న పర్ణశాల పీహెచ్‌సీలో చేర్పించి చికిత్స చేయించామన్నారు. అనంతరం ఆమె తల్లిదండ్రులకు అప్పగించామని తెలిపారు. ఆత్మహత్యాయత్నం ఎందుకు చేసిందో తెలియదన్నారు.

పది మంది జూదరుల అరెస్టు

మధిర రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం ఇల్లూరు గ్రామం వద్ద పేకాట ఆడుతున్న పదిమందిని ఆదివారం సాయంత్రం అరెస్టు చేసి వారి వద్దనుంచి రూ.6,330నగదు, ఐదు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు మధిర టౌన్ ఎస్ఐ ఎన్.సంధ్య తెలిపారు. మధిర మండలం ఇల్లూరు గ్రామం దాటిన తర్వాత ఓ సుబాబుల్ తోటలో పదిమంది పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో టౌన్ పోలీసులు ఆప్రదేశానికి వెళ్లి పేకాట స్థావరంపై దాడి చేశారు. పేకాట ఆడుతున్న పదిమందిని అరెస్టు చేసి వారి వద్దనుంచి రూ.6,330నగదు, ఐదు ద్విచక్రవాహనాల స్వాధీనం చేసుకొని మధిర టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పదిమందిపై కేసు నమోదు చేశారు.

బైక్ ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

కరకగూడెం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భట్టుపల్లి పంచాయతీ వీరాపురం సమీపంలో ఆదివారం ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తికి గాయాలయ్యాయి. అశ్వాపల్లి మండలం నడింగూడెం గ్రామానికి చెందిన పాయం రవితేజ వాహనం నడుపనుతున్న ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడటంతో ఆ యువకుడికి తీవ్ర గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న కరకగూడెం ఎస్ఐ రాజేందర్ సంఘట స్థలం వద్దకు వెళ్లి క్షతగాత్రుణ్ని 108 వాహనంలో మణుగూరు వైద్యశాలకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం..

ఖమ్మం రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొని ఒకరు మృతిచెందగా మరొకరికి తీవ్ర గాయాలు అయిన సంఘటన ఖమ్మం రూరల్ మండలం, కరుణగిరి వద్ద ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేటకి చెందిన ఏనుగు మల్లారెడ్డి(38) ఖమ్మం సమీపంలోని వెలుగుమట్లలో నివాసం ఉంటున్నాడు. రూరల్ మండలం, పోలేపల్లి గ్రామానికి చెందిన తమ్మినేశెట్టి రమేష్ ఇద్దరు స్నేహితులు. తమ్మిశెట్టి రమేష్‌తో కలిసి ద్విచక్రవాహనంపై ఖమ్మం నుంచి పోలేపల్లి వెళ్తున్నారు. మార్గంమధ్యలో కరుణగిరి వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మల్లారెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా రమేష్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడ్డ రమేష్‌ను చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ఓ ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని ఇన్‌స్పెక్టర్ రాజు పరిశీలించి కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు ఇళ్లలో చోరీ

- రూ.9 లక్షల నగదు, 6 తులాల బంగారం అపహరణ



సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాలు

ఖమ్మం రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఒకే సారి రెండు ఇండ్లలో చోరీ జరిగిన సంఘటన ఖమ్మం రూరల్ మండలం, మద్దులపల్లి పరిధిలోని మణికంఠనగర్‌లో శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మద్దులపల్లి పంచాయతీ పరిధిలోని మణికంఠనగర్ కాలనీలో నివాసం ఉంటున్న గోక కుమారస్వామి కుటుంబ సభ్యులు శనివారం రాత్రి వరంగల్‌లో జరుగుతున్న వారి బంధువుల వివాహానికి వెళ్లారు. ఇది గమనించిన గుర్తుతెలియని దొంగలు ఇంటి తాళం పగుల గొట్టి ఇంట్లో ఉన్నటువంటి రూ.3 లక్షల నగదు, 6 తులాల బంగారం అపహరించుకుపోయారు. ఉదయం వాకర్స్ తాలం పగులగొట్టినది చూసి కుమారస్వామికి తెలియచేయగా అతను వచ్చి చూడగా బంగారం, నగదు అపహరణకు గురైనట్లు గుర్తించారు. అదేవిధంగా అదేకాలనీలో ఉంటున్న వడాల రోజా తన భర్త వడాల రమేష్ శభరిమల వెళ్లడంతో శనివారం రాత్రి ఇంటికి తాళం వేసి పక్కనే ఉన్న తమ తల్లిగారింటికి వెళ్లింది. ఆదివారం ఉదయం ఇంటికి వచ్చి చూసే సరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా సుమారు రూ. 6 లక్షలు చోరీకి గురైనట్లు తెలిసింది. సంఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యానికి బానిసై ఇద్దరి ఆత్మహత్య

- పాల్వంచ మండలంలో వేర్వేరు చోట్ల ఘటనలు

పాల్వంచ, డిసెంబర్ 08 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై ఇద్దరు వ్యక్తులు బలవన్మరణానికి పాల్పడిన సంఘటన పాల్వంచ మండలంలో చోటుచేసుకుంది. మండలపరిధిలోని నాగారం కాలనీ గ్రామానికి చెందిన భూక్యా వీరు(40) గత కొంతకాలంగా మద్యానికి బానిసై భార్యను నిత్యం డబ్బులు ఇవ్వాలని వేధిస్తున్నాడు. శనివారం భార్యను డబ్బులు కావాలని అడిగాడు. దానికి భార్య ససేమీరా అనడంతో మనస్తాపానికి గురై క్షణికావేశంలో ఆదివారం తెల్లవారుజామున ఇంట్లో పురుగుల మందు సేవించి ఆత్మహత్య యత్నానికి పాల్పడాడు. కుటుంబసభ్యులు హుటహుటిన పాల్వంచ ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. చికిత్స కొనసాగుతుండగా కొద్దిసేపటికే మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఏఎస్ఐ సుధాకర్ తెలిపారు.

మండలపరిధిలోని ప్రభాత్‌నగర్ (రెడ్డిగూడెం) గ్రామానికి చెందిన పద్దం సరిత(33) మద్యానికి బానిసై భర్తను నిత్యం డబ్బులు ఇవ్వాలని వేధిస్తుండేది. ఈక్రమంలో శనివారం భర్తను డబ్బులు కావాలని అడుగగా.. మద్యం తాగవద్దని మందలించడంతో మానస్తాపానికి గురై పురుగుల మందు సేవించింది. కొత్తగూడెం ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించి వైద్యం చేయిస్తుండగా ఆదివారం మృతి చెందింది. మృతురాలి భర్త ముడయ్య ఫిర్యాదు మేరకు పోలీస్ హెడ్ కానిస్టేబుల్ హరిబాబు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పట్టు చీరల చోరీపై పోలీసులకు ఫిర్యాదు

ఖమ్మం క్రైం డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎగ్జిబిషన్‌లో అమ్మేందుకు తీసుకువచ్చిన పట్టు చీరలు చోరీకి గురయ్యాయని బాధితుడు ఆదివారం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. యాదాద్రి జిల్లా, పోచంపల్లికి చెందిన ఆడెపు అరవింద్ అనే వ్యక్తి ఈ నెల 6వ తేదీన నుంచి 8 వరకు ఖమ్మంలోని ఓ ఫంక్షన్ హాలులో నిర్వహించిన ఎగ్జిబిషన్‌లో పట్టు చీరలు విక్రయించేందుకు సుమారు రూ.83 వేలు విలువచేసే చీరలను తీసుకువచ్చాడు. ఎగ్జిబిషన్‌లో తాను పెట్టిన షాపు పక్కనేఉన్న షాపు వ్యక్తి చోరీచేసినట్టు గుర్తించి చీరలు చూడగా కొన్ని చీరలు కనపడలేదని బాధితుడు తెలిపాడు. దీంతో డయల్ 100కు ఫోన్‌చేసి ఫిర్యాదుచేశానని, అనంతరం ఆదివారం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

నేడు, రేపు జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్

- ప్రదర్శనకు సిద్ధంగా 119 ఇన్‌స్పైర్, 486 విజ్ఞాన శాస్త్ర నమూనాలు
- జడ్జిమెట్ కోసం 32 మందితో 16 కమిటీలు
- ఏర్పాట్లు పరిశీలించిన డీఈవో

ఖమ్మం ఖానాపురంహవేలి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్ఎఫ్ఎస్ బల్లేపల్లి, పాఠశాలలోని డాక్టర్ విక్రమ్ సారాభాయ్ ప్రాంగణంలో సోమవారం, మంగళవారం జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఈవో సోమశేఖర శర్మ ఆదివారం తెలిపారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఈవో

ఈ ప్రదర్శనలో ఇన్‌స్పైర్‌కు సంబంధించి 119 నమూనాలు, విజ్ఞాన శాస్త్రానికి సంబంధించి 486 నమూనాలు రిజిస్ట్రేషన్ చేసుకొని ప్రదర్శనకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఈ ప్రదర్శనల జడ్జిమెట్ కోసం 32 మందితో 16 కమిటీలను నియమించామని తెలిపారు. జూనియర్స్, సీనియర్స్ నుంచి రాష్ట్రస్థాయికి ఉత్తమ ప్రదర్శనలు ఎంపిక చేస్తామని తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం నాలుగు గంటలకు శాస్త్రవేత్తలతో ఉపన్యాసాలు ఏర్పాటు చేశామని తెలిపారు.

ఈ ప్రదర్శనలో మొత్తం ప్రదర్శనలను ఏడు విభాగాలుగా ఏర్పాటు చేసినట్లు డీఈవో తెలిపారు. ఆహారం ఆరోగ్యం, రవాణా , కమ్యూనికేషన్, న్యాచురల్ ఫామింగ్, డిజాస్టర్ మేనేజ్మెంట్, మ్యాథమెటికల్ మోడలింగ్, వేస్ట్ మేనేజ్మెంట్, రిసోర్స్ మేనేజ్మెంట్ విభాగాలని తెలిపారు. ఈ ప్రదర్శనలను తిలకించుటకు 9వ తేదీన రఘునాథపాలెం, ఖమ్మం రూరల్, ఖమ్మం 3 టౌన్ ఏరియాకు సంబంధించిన ప్రభుత్వ, ప్రైవేటు, రెసిడెన్షియల్, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులు పదో తారీఖున ఖమ్మం అర్బన్, వన్ టౌన్, టూ టౌన్ పరిధిలోని పాఠశాలల విద్యార్థులు పాల్గొనాలని తెలిపారు. ప్రదర్శనలు తిలకించడానికి 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు మాత్రమే అనుమతి ఉందన్నారు. సన్నాహక సమావేశం ఏర్పాటులో జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర్ శర్మ, అర్బన్ మండల విద్యాశాఖ అధికారి శైలజ లక్ష్మి, రూరల్ ఎంఈవో శ్రీనివాస్, రఘునాథపాలెం ఎంఈవో రాములు, కూసుమంచి ఎంఈవో వీరస్వామి సైన్స్ ఆఫీసర్ జగదీష్, సీఎంవో రాజశేఖర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


మీడియా అకాడమీ చైర్మన్‌ను కలిసిన జర్నలిస్టులు



మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డిని
కలిసిన జర్నలిస్టు యూనియన్, హౌజింగ్ సొసైటీ నేతలు

ఖమ్మంటౌన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆదివారం ఖమ్మం వచ్చిన మీడియా అకాడమీ చైర్మన్ కె శ్రీనివాసరెడ్డిని జర్నలిస్టు యూనియన్లు టీయూడబ్ల్యూజే- టీజేఎఫ్, ఐజేయూ, స్తంభాద్రి హౌజింగ్ సొసైటీ ఆధ్వర్యంలో జర్నలిస్టుల బృందం కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఖమ్మం హౌజింగ్ సొసైటీ అంశాన్ని ఆయన దృష్టికి తెచ్చి, జర్నలిస్టులకు ఇళ్లస్థలాల కేటాయింపుకోసం మీడియా అకాడమీ తరఫున చొరవ చూపాలని కోరారు. ఖమ్మం జర్నలిస్టుల దశాబ్దాల కల సాకారం చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే-ఐజేయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె. రాంనారాయణ, జర్నలిస్టు రెండు యూనియన్ల టీజేఎఫ్, ఐజేయూ జిల్లా అధ్యక్షుడు ఆకుతోట ఆదినారాయణ, వనం వేంకటేశ్వర్లు, స్తంభాద్రి జర్నలిస్టు సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు కనకం సైదులు, బొల్లం శ్రీనివాస్, కోశాధికారి సాంబశివరావు, ఉపాధ్యక్షుడు పాపారావు, టీజేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్రా రవి తదితరులు పాల్గొన్నారు.



రాములు స్వామిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

దళిత పూజారికి ఘన సన్మానం

భద్రాచలం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మొట్టమొదటి దళిత పూజారిగా గత మూడేళ్లుగా కొనసాగుతున్న వరంగల్ జిల్లా దువ్వాడ మండలం ముదునూరు గ్రామంకు చెందిన గాదెపాక రాములు స్వామిని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు సన్మానించారు. పోకల దమ్మక్క, భక్త కన్నప్ప, శబరి మాతలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాలని రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తున్న రాములు స్వామి ఆదివారం భద్రాచలం చేరుకున్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాములు స్వామిని ఎమ్మెల్యే వెంకట్రావు శాలువాతో ఘనంగా సన్మానించారు. పోకల దమ్మక్క, భక్త కన్నప్ప, శబరిమాతలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాలని తాను రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తున్నట్లు రాములు స్వామి తెలిపారు.

మ్యూజియం అభివృద్ధి పనులను
త్వరగా పూర్తి చేయాలి

- భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేష్ వి. పాటిల్

భద్రాచలం, డిసెంబరు 8 (ఆంధ్ర జ్యోతి): భద్రాచలంలోని గిరిజన మ్యూజియం వద్ద చేపడుతున్న పలు అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. ఆదివారం భద్రాచలంలోని ఐటీడీఏ ఆవరణలో ఉన్న గిరిజన మ్యూజియంను సందర్శించి అనంతరం చేపడుతున్న గడ్డి ఇళ్లను, ఆదివాసీ వంటకాలు, స్టాల్స్, పార్కు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ మ్యూజియంను సందర్శించే పర్యాటకులకు ఆకర్షించే విధంగా గిరిజన సంస్కృతి ఉట్టిపడేలా అభివృద్ధి పనులు పూర్తి చేయాలన్నారు. మ్యూజియంలోకి పర్యాటకులు ప్రవేశించగానే గిరిజన సంస్కృతి, ఆచార వ్యవహారాలకు సంబంధించిన చిత్రాలను ఉంచాలని, ప్రస్తుతం ఉన్న వాటికి పెయింటింగ్ వేయించాలని కలెక్టరు ఆదేశించారు. సాయంత్రం బస చేసే టూరిస్టులకు గిరిజన సంస్కృతి, నృత్యాలు ఏర్పాట్లు చేయాలని, బొజ్జిగొప్ప గ్రామానికి ప్రవేశించే ముందు పూర్తిస్థాయిలో సోలార్ లైట్లు అమర్చి ఆ ప్రదేశం అంతా గిరిజన సంస్కృతి సంప్రదాయాలు ఆచార వ్యవహారాలకు సంబంధించిన చిత్రాలు పెట్టాలన్నారు.



సమ్మేళనంలో మాట్లాడుతున్న నాటి హెచ్‌ఎం శ్రీరాములు

క్రమశిక్షణ ఎదుగుదలకు దోహదం చేస్తుంది..

పాల్వంచ టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అవలంబిస్తే జీవితంలో ఎదుగుదలకు అది దోహదం చేస్తుందని బొల్లోరుగూడెం హైస్కూల్ నాటి విశ్రాంత ప్రధానోపాధ్యాయులు శ్రీరాములు అన్నారు. 1991-92 పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కేఎస్‌పీ రోడ్డులోని ఓ ఫంక్షన్ హాలులో ఆదివారం ఉత్సాహంగా జరుపుకొన్నారు. నాటిగురువులైన గుణసుందరి, సాంబశివరావు, నాగేశ్వరరావులను నేటి పాఠశాల ఉపాధ్యాయులైన ఎన్. శ్రీను, హరి, పద్మజలను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. నాటి పూర్వ విద్యార్థులంతా 32 సంవత్సరాల తర్వాత నేడు ఇలా కలుసుకోవడంతో నాటి స్మృతులను నెమరు వేసుకుని ఒకింత భావోద్వేగానికి లోనయ్యారు.



అనుమతులు లేకుండా ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించవద్దు

ఖమ్మంక్రైం, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించవద్దని ఖమ్మంటౌన్ ఏసీపీ రమణమూర్తి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా నగరంలో ఎటువంటి సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఆంక్షలు విధిస్తున్నట్టు తెలిపారు. సిటీ పోలీసు యాక్టు ఆంక్షల నేపథ్యంలో వివిధ వర్గాల ప్రజలు, రాజకీయపార్టీలు, వివిధ సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని, నిబంధనలు అతిక్రమించి ర్యాలీలు, ఊరేగింపులు,సభలు, సమావేశాలు నిర్వహిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ప్రకటనలో తెలిపారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

కూరగాయలు ధరలు
(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	40రూ.
వంకాయ	24
గుత్తి వంకాయ	38
బీరకాయ	54
పచ్చిమిర్చి	38
కాకరకాయ	38
బెండకాయ	24
పొట్లకాయ	34
దోసకాయ	28-44
నాటుచిక్కుడు	80
గోరుచిక్కుడు	28
క్యాబేజీ	24
దొండ	30-38
సొరకాయ	20
క్యారెట్	68
క్యాప్సికం	64
ఆలుగడ్డ	36
ఉల్లిగడ్డ	60-70
కోడిగుడ్లు ట్రే (30 గుడ్లు)	195
కొత్తిమీర కట్ట	40

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

సినిమా CINEMA

నగరంలో చిత్రాలు..

వినోద:	లక్ష్మీభాస్కర్
శ్రీనివాస:	అమరన్
సాయిరాం:	మెకానిక్‌రాకీ
కేపీఎస్:	పుష్ప 2
తిరుమల:	పుష్ప 2
సినీ గెలాక్సీ:	పుష్ప 2

మధ్యాహ్న భోజనం నాణ్యత పెంచాలి

డీఈవో సోమశేఖర శర్మ

కుక్ కం హెల్పర్‌లకు వంటల పోటీలు



వివిధ రకాల వంటలను పరిశీలిస్తున్న సీఎంవో రాజశేఖర్

ఖమ్మం ఖానాపురంహవేలి డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనం నాణ్యతను పెంచాలని, విద్యార్థుల ఆరోగ్యం పెంపొందటానికి పుష్టికరమైన ఆహారం అందించాల్సిన అవసరం ఉందని డీఈవో సోమశేఖర శర్మ అన్నారు. ఖమ్మం లోని అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్లో ఆదివారం నిర్వహించిన మధ్యాహ్న భోజన కుక్ కం హెల్పర్ల జిల్లా స్థాయి వంటలు పోటీలను ఆయన ప్రారంభించారు. డీఈవో మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే వారు సక్రమంగా విద్యాభ్యాసన చేయగలుగుతారని విద్యతోపాటు సృజనాత్మక అంశాలు, క్రీడలలో తమ ప్రతిభను చూపగలుగుతారని తెలిపారు. అందువల్ల ప్రభుత్వం మధ్యాహ్న భోజనానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్న భోజనం వండి అందించే కుక్ కం హెల్పర్లకు భత్యం కూడా పెంచుతున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం భోజన నాణ్యత కోసం రాష్ట్ర ఫుడ్ కమిషన్ పలు సూచనలు చేసినట్లు తెలిపారు. మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు అందించే దినుసులో వాటి పరిమాణం, నాణ్యత తదితరు అంశాలపై మండలాల వారీగా కుక్ కం హెల్పర్లకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి మండలం నుంచి ఎంపికైన కుక్ కం హెల్పర్లు జిల్లా స్థాయి వంటలు పోటీలకు హాజరైనట్లు వివరించారు. ఈ పోటీలను విజయవంతంగా నిర్వహించిన జిల్లా సమగ్ర శిక్ష సీఎంవో యలగందుల రాజశేఖర్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల నుంచి కుక్ కం హెల్పర్లు ఉత్సాహంగా వంటల పోటీలో పాల్గొన్నారు.

విజేతలు: జిల్లాస్థాయి వంటల పోటీలో బోనకల్ మండలం ముష్టికుంట్ల హైస్కూల్ కుక్ కం హెల్పర్ జె. తిరుపతమ్మ ప్రథమ స్థానంలో, రెండవ స్థానంలో ముదిగొండ మండలం లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాల కుక్ కం హెల్పర్ పి. నాగమ్మ, మూడవ స్థానంలో నేలకొండపల్లి ఆరెగూడెం ఉన్నత పాఠశాల కుక్ కం హెల్పర్ డి.వీరలక్ష్మి నిలిచారు. విజేతలకు నగదు బహుమతిని ప్రధానం చేయనున్నట్లు డీఈవో తెలిపారు. ప్రథమ బహుమతి సాధించిన వారిని త్వరలో హైదరాబాదులో జరగనున్న రాష్ట్రస్థాయి వంటల పోటీలలో పాల్గొనవలసి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యుఆర్ఎస్ స్పెషల్ ఆఫీసర్ విరిత, సిబ్బంది, కేజీబీవీ అర్బన్ సిబ్బంది పాల్గొన్నారు.

త్రివేణి విద్యార్థులకు మోటివేషన్ తరగతులు

గత ఏడాది పదిలో 10/10 సాధించిన విద్యార్థులకు , వారి తల్లిదండ్రులకు సన్మానం

ఖమ్మం ఖానాపురంహవేలి డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): 2023-24 విద్యా సంవత్సరంలో త్రివేణి పాఠశాల నుంచి 10/10 జీపీఏ సాధించిన విద్యార్థులను వారి తల్లిదండ్రులను ఆదివారం త్రివేణి యాజమాన్యం ఘనంగా సన్మానించింది. పాఠశాలలోని సత్తుపల్లి, ఖమ్మం బ్రాంచ్‌లకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న త్రివేణి పాఠశాలల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ త్రివేణి విద్యార్థులు కేవలం చదువులోనే కాదు సద్గుణాలలోనూ అందరికంటే ముందుంటారని నిత్యం తమ నైపుణ్యాలను పెంచుకోవడం కోసం ప్రయత్నం చేయడానికి త్రివేణి ఎల్లప్పుడూ అనుకూలమైన అవకాశాలను కలిగిస్తుందని అన్నారు. త్రివేణి, కృష్ణవేణి విద్యాసంస్థల డైరెక్టర్ యలమద్ది వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి వ్యక్తి ప్రతి విద్యార్థి తనను తాను ఎల్లప్పుడూ తీర్చిదిద్దుకుంటూ ఇంట్రా మోటివేటర్గా ఎదగాలని అన్నారు. అనంతరం ప్రముఖ సైకాలజిస్ట్ మోటివేషనల్ స్పీకర్ కార్పొరేట్ ట్రైనర్ డాక్టర్ వంగీపురపు శ్రీనాథ చార్యులు 2024 - 25 విద్యా సంవత్సరంలోని పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో త్రివేణి పాఠశాల సీఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, ఖమ్మం త్రివేణి పాఠశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, సత్తుపల్లి త్రివేణి పాఠశాల ప్రిన్సిపాల్ సరిత, పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ స్వప్న, ముస్తఫా, క్యాంపస్ ఇన్‌చార్జ్ చార్లెస్, సందీప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థుల తల్లిదండ్రులను సన్మానిస్తున్న పాఠశాల యాజమాన్యం

అలరించిన స్వరార్చన



పాటలు పాడుతున్న కళాకారులు

ఖమ్మం సాంస్కృతికం డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఓహో మేఘమాల పేరుతో స్వరసుధ మ్యూజిక్ యూనిట్ ఆధ్వర్యంలో ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన స్వరార్చన కార్యక్రమం సంగీత ప్రియులను అలరించింది. ఘంటసాల జయంత్యుత్సవాల్లో భాగంగా ఈ సంగీత విభావరి నిర్వహించారు. ఆనాటి కథానాయకులకు పాడిన పాటలను అభిమానులు ఆస్వాదించారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారులు విన్నూత్న, లాస్యల నృత్యాలు ఆకట్టుకున్నాయి. పలువురు కళాకారులను మెడల్స్, షీల్డ్‌తో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో స్వరసుధ మ్యూజిక్ అధ్యక్షుడు కొమర్రాజు మాధవరావు, పారుపల్లి సురేష్, వీవీ రెడ్డి పాల్గొన్నారు.

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

తిరుమలాయపాలెం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక సర్వేను పటిష్టంగా చేపట్టాలని తహసీల్దార్ పీవీ రామకృష్ణ తెలిపారు. ఆదివారం మండలంలోని పిండిప్రోలు, తిరుమలాయపాలెం, తెట్టలపాడు, దమ్మాయిగూడెం తదితర గ్రామాల్లో కార్యదర్శులు చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఎంపీడీవో సిలార్‌సాహెబ్‌తో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ లబ్దిదారుల ఎంపిక ఎటువంటి అవకతవకలు జరగకుండా నిజమైన లబ్దిదారులను గుర్తించాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీవో సూర్యనారాయణ, పాల్గొన్నారు.

సీపీఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శిగా విక్రమ్



ఖమ్మంటౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సీపీఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శిగా వై. విక్రమ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం నగరంలోని సెయింట్ మేరీస్ పాఠశాలలో నిర్వహించిన డివిజన్ మహాసభలో విక్రమ్ ఎన్నికయ్యారు. ఇప్పటి వరకు ఆయన సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడిగా పనిచేస్తున్నారు. ఖమ్మం నియోజకవర్గంలో జిల్లాపార్టీ సూచనల మేరకు అనేక ప్రజాపోరాటాలు నిర్వహించిన విక్రమ్ పాఠశాల స్థాయిలోనే విద్యార్థుల సమస్యలపై పోరాడేందుకు ఎస్ఎఫ్ఐను వేదికగా చేసుకొని, నగరంలోని సిద్దారెడ్డి కళాశాలలో ఇంటర్ చదువుతున్నప్పుడే ఎస్ఎఫ్ఐ కళాశాల అధ్యక్షుడిగా, తరువాత ఖమ్మం నగర ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. 2014లో జరిగిన భూపోరాటంలో పాల్గొన్న వై. విక్రమ్ రెండుసార్లు జైలుకు వెళ్లారు. నగరంలో కొత్తబస్టాండ్ నిర్మాణంపై. పాత బస్టాండ్‌ను తిరిగి ప్రారంభించేందుకు జరిగిన పోరాటాల్లో, ప్రజాసమస్యలపై నిర్వహించిన పోరాటాల్లో విక్రమ్‌పై 14 కేసులు నమోదయ్యాయి. కాగా 2017నుంచి బోడేపూడి విజ్ఞానకేంద్రంతో కలిసి సీపీఎం టూటౌన్ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి నెలా మొదటి శనివారం మెడికల్ క్యాంప్ నిర్వహించి ప్రముఖ వైద్యుల సహకారంతో నామమాత్రపు రుసుముతో రోగ నిర్ధారణ పరీక్షలు, మందులు అందిస్తున్నారు. పార్టీ బలోపేతానికి కృషిచేస్తున్న విక్రమ్ ఆదివారం డివిజన్ కార్యదర్శిగా ఎన్నికయ్యారు.

పేదలందరికి ఇందిరమ్మ ఇళ్లు కట్టించాలి: గుమ్మడి

రఘునాథపాలెం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కుల, మతాలు, రాజకీయాలతో సంబంధం లేకుండా పల్లెల నుంచి పట్టణాల వరకు పేదలందరికి మొదటి విడతలోనే ఇందిరమ్మ ఇళ్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టించి ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే, సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుమ్మడి నర్సయ్య డిమాండ్ చేశారు. ఆదివారం రఘునాథపాలెం మండలం చింతగుర్తిలో నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ప్రభుత్వం అట్టహాసంగా ప్రకటనలు చేస్తోందని, పేదలకు ఇళ్లు ఇవ్వటం ద్వారానే లక్ష్యాలు నెరవేరతాయని తెలిపారు. రైతు రుణమాఫీ పూర్తి స్థాయిలో అమలు జరగలేదని విమర్శించారు. రూ.2లక్షలకు పైగా బ్యాంకు బకాయిలు ఉన్న రైతులకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. మండల కార్యదర్శి కేలోత్ భాస్కర్, నాయకులు ఆవుల వెంకటేశ్వర్లు, ఆవుల అశోక్, షేక్ మదార్‌సాహెబ్, లింగన్నబోయిన నాగేశ్వరరావు, ఆడెపు సంగయ్య, సుధగాని ముత్తిలింగం, కవిత, రామయ్య పాల్గొన్నారు.

ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ నూతన కమిటీ ఎన్నిక



వెంకటేశ్వర్లు

కూసుమంచి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ట్రైబల్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కూసుమంచి మండలం గోపాలరావుపేటలో పూర్వ అధ్యక్షుడు అజ్మీరా రాందాస్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఖమ్మంజిల్లా రీజనల్ కమిటీ అధ్యక్షుడిగా తేజావత్ వెంకటేశ్వర్లు(డీఈ, డీపీఈ ఖమ్మం), ప్రధానకార్యదర్శిగా కూసుమంచి ఏడీఈ కోక్యానాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉపేందర్, విజయ్, ట్రెజరర్‌గా బాలాజీ, లేడీ రిప్రజెంటేటివ్‌గా చంద్రకళ, గౌరవ సలహాదారులుగా శ్రీధర్‌ను ఎన్నుకున్నారు. ముఖ్యఅతిథులుగా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నందా రాథోడ్, భద్రుపవార్ పాల్గొన్నారు. కార్యక్రమంలో పలువురు ఏడీఈలు, ఏఈలు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన వారికి 'గోపా' సన్మానం

ఖమ్మంచర్చికాంపౌండ్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కాలంలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన గౌడ సామాజిక వర్గానికి చెందిన వారిని జిల్లా గౌడ్ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోపా) ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. నగరంలోని మంచికంటిభవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో గత మార్చిలో జరిగిన పదో తరగతి పరీక్షల్లో అధిక గ్రేడ్లు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందించారు. గోపా రాష్ట్ర అధ్యక్షుడు బండి సాయన్నగౌడ్ మాట్లాడుతూ సు మారు 60మంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం అభినందనీయమని, విద్యతోనే కుల అభివృద్ధి జరుగుతుందన్నారు. గౌడ విద్యార్థులు శ్రద్ధతో చదువుకుని ఉన్నతశిఖరాలు అధిరోహించాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ మాట్లాడుతూ జిల్లాలో గౌడలందరిని ఏకతాటిపై తెచ్చేందుకు కృషిచేస్తామని, త్వరలోనే గౌడ విద్యార్థుల సౌకర్యార్థం ఖమ్మం లో గౌడ హాస్టల్ నిర్మాణానికి కృషిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గోపా జిల్లా అధ్యక్షుడు గుడిద శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షుడు తాళ్లపల్లి రామకృష్ణ, మధసూదన్, గౌడ జేఏసీ నాయకులు అమరగాని వెంకన్న, కాంగ్రెస్ సీనియర్‌నాయకులు వడ్డెబోయిన నర్సింహారావు, ప్రము ఖ వైద్యులు కేశగాని రాజశేఖర్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్ పాల్గొన్నారు.

గరికపాటి సోదరులకు ప్రముఖుల పరామర్శ



రాఘవయ్య చిత్ర పటంవద్ద నివాళులర్పిస్తున్న తుమ్మల సతీమణి బ్రమరాంబ

ఖమ్మం రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీ సిటీ ఛైర్మన్ గరికపాటి వెంకట్రావు, అంజనేయప్రసాద్ సోదరుల తండ్రి రాఘవయ్య దశదిన కర్మ ఆదివారం కరుణగిరి ప్రాంతంలో జరిగింది. ఈ కార్యక్రమానికి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల సతీమణి బ్రమరాంభ, తనయుడు తుమ్మల యుగేందర్, గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర ఇరిగేషన్ ఛైర్మన్ మువ్వా విజయ్ బాబు, ఖమ్మం మేయర్ నీరజ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ దయకర్‌రెడ్డి, టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్‌రావు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కార్పొరేటర్లు, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, చావా నారాయణరావు, శరత్, బాలగంగాధర్ తిలక్, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు బండి జగదీష్, డీసీసీబీ మాజీ ఛైర్మన్ కూరాకుల, కమ్మ సంఘం అధ్యక్షుడు ఎరినేని రామారావు, విత్తనాభివృద్ధి సంస్థ మాజీ ఛైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, కాంగ్రె స్ నాయకులు కాకాని యశ్వంత్‌చౌదరి, యర్రా విజయ్‌రెడ్డి, షేక్.దావూద్, పలువురు ప్ర ముఖులు హజరై రాఘవయ్య చిత్రపటానికి నివాళులర్పించి గరికపాటి సోదరులను పరామర్శించారు.

కన్నుల పండుగగా మహాపడి పూజ



పడి పూజ నిర్వహిస్తున్న గురు స్వామీ నారాయణన్ నంబూద్రి

ఖమ్మం ఖానాపురంహవేలి డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని చైతన్య నగర్ రోడ్ నెంబర్ 10లో శ్రీధర్మశాస్త్ర అన్నదాన సేవా సమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి కన్నుల పండుగగా మహాపడి పూజ నిర్వహించారు. ఈ మహాపడి పూజను శ్రీనివాసనగర్ అయ్యప్ప ఆలయ ప్రధాన పూజారి పాకతిల్లం నారాయణన్ నంబూద్రి, హరిప్రసాద్ నీలమనిల్లం ఆధ్వర్యంలో నిర్వహించారు. పూజకు అయ్యప్ప భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అల్పాహారం అందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఛైర్మన్ మేకల హనుమంతరావు, కార్పొరేటర్ చావా మాధురి నారాయణరావు, అట్లూరి మధు, సరిపూడి గోపి, పుల్లంరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికకు సర్వే ప్రారంభం

ఖమ్మం నగరంలో 60 డివిజన్లలో 60మంది ప్రత్యేక సిబ్బంది కేటాయింపు



వివరాలు సేకరిస్తున్న కేఎంసీ ఉద్యోగులు

ఖమ్మం సంక్షేమ విభాగం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రకటించిన ఇందిరమ్మ నివాసాల నిర్మాణాలకు తొలి అంకం మొదలైంది. ఖమ్మం నగరంలోని 60 డివిజన్లలో ఆదివారం ఖమ్మం నగర పాలక సంస్థ ఉద్యోగులు శ్రీకారం చుట్టారు. ఇళ్ల లేని నిరుపేదలు, పేదలు ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వం ప్రకటించటంతో ఇటీవల ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో 53,900 మంది ఆశావాహులు ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు చేశారు. దీంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఖమ్మం నగర పాలక సంస్థలోని 60 డివిజన్లకు ప్రత్యేకంగా 60 మంది ప్రభుత్వ రెగ్యూలర్ ఉద్యోగులను కేటాయించారు. బిల్ కలెక్టర్లు, జూనియర్ అసిస్టెంట్‌లు, ఇతర ఉద్యోగులను నియామకం చేశారు. వారిపై పర్యవేక్షణకు ఇంజనీరింగ్ అధికారులను ఏర్పాటు చేశారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులను ఎంపిక చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా యాప్‌ను ఏర్పాటు చేసింది. ఆ యాప్‌లో ఆయా డివిజన్లు, ప్రాంతాల దరఖాస్తుదారుల జాబితాలను కేఎంసీ బృందాలు స్థానిక కార్పొరేటర్లు సహాయంతో సర్వేను ప్రారంభించారు. ఇందిరమ్మ యాప్‌లో దరఖాస్తుదారుల వివరాల మేరకు ఆయా ప్రాంతాలకు బృందాలు చేరుకుంటున్నారు. దరఖాస్తుదారులకు సొంత ఇంటి స్థలంలో ఉంటున్నారా. లేదా అద్దె భవనంలో ఉంటున్నారా. ప్రస్తుతం ఉంటున్న ఇంటి పొటో, స్థలం డాక్యూమెంట్ స్కానింగ్ వివరాలు సేకరిస్తున్నారు. కాగా తొలి రోజు సర్వే మందకొడిగా సాగింది. దరఖాస్తుదారుల డేటా ఖమ్మం నగరం మొత్తం ఉండటం, డివిజన్ వారీగా లేక పోవటంతోడేటా సర్వే బృందాలు ఇబ్బందులు ఎదుర్కొన్నాయి.

కర్రలతో ఇరువర్గాల దాడులు

ఖమ్మంక్రైం, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): కర్రలతో ఇరువర్గాలు దాడులు చేసుకున్న సంఘటన కు సంబంధించిన వీడియో సోషల్‌మీడియాలో వైరల్ అవుతోంది. నగరంలోని పాకబండ బజార్‌లో కొంత మంది యువకులు ఇటీవల రాళ్లతో, కర్రలతో దాడులు చేసుకున్నట్టు తెలుస్తోంది. కాగా ఓ యువతి విషయమై ఇరువర్గాలు దాడులకు పాల్పడినట్టు సమాచారం. విషయం తెలిసిన వన్‌టౌన్ పోలీసులు ఇరువర్గాలను స్టేషన్‌కు పిలిపించి మాట్లాడినట్టు కూడా తెలిసింది.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఖమ్మం రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తెల్దారుపల్లి ఎన్నెస్పీ కాలువలో గుర్తు తెలియని మృతదేహం ఆదివారం లభ్యం అయింది. స్థానికులు గుర్తించి రూరల్ పోలీసులకు సమాచారం అందించగా, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సామాజిక సేవకుడు అన్నం శ్రీనివాస్ బృందం కాలువలో ఉన్న మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడికి వయసు సుమారు 35 సంవత్సరాలు ఉంటుంది. వంటిపై నల్లరంగు తెల్లచుక్కల చొక్కా ధరించి, షాట్ వేసుకుని ఉన్నాడు. మృదేహన్ని పోసుటమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి గుర్తు తెలియని మృతదేహంగా కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యాశాఖకు మంత్రిని కేటాయించాలి: పీడీఎస్‌యూ

ఖమ్మం సంక్షేమ విభాగం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది జరిగినా విద్యాశాఖకు మంత్రిని కేటాయించకపోవటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్, వంగూరి వెంకటేష్ ఆరోపించారు. విద్యా సమస్యల పరిష్కారం కోరుతూ 10న సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు ఇవ్వటంతో ఆదివారం ఖమ్మంలో వారు పోస్టర్ ఆవిష్కరించారు. సంక్షేమ వసతిగృహాలు, గురుకులాల్లో సరైన భోజనం ఏర్పాటు చేయలేదని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం వెళ్లిందని ఆరోపించారు. నాయకులు పృథ్వి, నరేందర్, ప్రసాద్; స్టాలిన్, వెంకటేష్ పాల్గొన్నారు.

కార్మిక చట్టాల సవరణ బిల్లును వ్యతిరేకించాలి

టీయూసీఐ(ఐఎఫ్‌టీయూ)రాష్ట్ర కార్యదర్శి రామయ్య డిమాండ్

ఖమ్మం సంక్షేమ విభాగం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాలు పాటు కార్మిక సంఘాలు అనేక పోరాటాల చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తొలగించేందుకు సవరణలు చేసిందని, అసెంబ్లీలో కార్మిక చట్టాల సవరణ బిల్లుకు వ్యతిరేకిస్తూ తీర్మానం చేసి పంపాలని టీయూసీఐ(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర కార్యదర్శి జీ రామయ్య డిమాండ్ చేశారు. ఆదివారం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సంఘం జిల్లా కమిటి సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని, ఎన్నికల్లో ప్రకటించిన విదంగా కార్మిక సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని రంగాల కార్మికుల వేతనాలను పెంచేందుకు ప్రభుత్వం 75 జీవోలను విడుదల చేసిందని వాటిని తక్షణమే అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని, ఖమ్మంలో ఈఎస్ఐ హాస్పటల్ ఏర్పాటు చేయాలని కోరారు. సంఘం జిల్లా కార్యదర్శి వెంకన్న నాయకులు డీ శ్రీనివాసరావు, కే శ్రీనివాసరావు, ఆవుల అశోక్, సీవై పుల్లయ్య, ఎస్‌కే లాల్ మియా, శరత్, రామదాసు, గోసు పుల్లయ్య, పుల్లరావు, పురబొయిన వెంకన్న పాల్గొన్నారు.

అనాథలకు దుస్తుల పంపిణీ

కూసుమంచి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలేరులో 'యువత మేలుకో' ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అనాథలకు దుస్తులు పంపిణీ చేశారు. వీధి వీధికి తిరుగుతూ వారికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవస్థాపకులు శీలం రామకృష్ణ, నాగార్జున, మనోజ్, గోపి, నవీన్‌పాల్గొన్నారు.

అక్షయరెడ్డి మృతిపట్ల సంతాపం

ఖమ్మంటౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆమ్‌ఆద్మీ పార్టీ యూత్‌వింగ్ నాయకుడు, సోషల్‌మీడియా కార్యకర్త అక్షయరెడ్డి ఆకస్మిక మృతిపట్ల పార్టీ తెలంగాణా కోర్‌కమిటీ సభ్యుడు తిరుమలరావు ఓ ప్రకటనలో తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. అక్షయరెడ్డి ఆదివారం హైదరాబాద్‌నుంచి బాన్సువాడకు కారులో వెళుతుండగా జరిగిన ప్రమాదంలో అక్షయరెడ్డి, అతడి తల్లి అక్కడికక్కడే మృతిచెందడం బాధాకరమన్నారు.

ఘనంగా న్యాయవాదుల వన మహోత్సవం



వనసమారాధనలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి రాజగోపాల్

ఖమ్మం లీగల్ డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఖమ్మం నగర శివాయిగూడెం దగ్గర గల మామిడి తోటలో ఘనంగా న్యాయవాదుల వన మహోత్సవంను నిర్వహించారు. ఈ వనమహోత్సవానికి ముఖ్యఅతిథిగా జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.రాజగోపాల్ పాల్గొని ప్రసంగించారు. వన సమారాధన భారతీయుల సంస్కృతి అని, న్యాయవాదులు కుటుంబాలతో వచ్చి ఆనందంగా గడపడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో అనేక సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు ఎంతో ఉల్లాస భరితంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయాధికారులు కె.ఉమాదేవి, వి.అపర్ణ, డి.రాం ప్రసాద్, ఎం.అర్చనాకుమారి, ఎం.కల్పన, కె.దీప, బి.రజని, వై.బిందుప్రియ, వి.మాధవి, ఆర్.శాంతిలత, శివరంజని, శీనయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాసరావు, కార్యదర్శి చింతనిప్పు వెంకట్, బార్ కౌన్సిల్ సభ్యులు కొల్లి సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

పెనుబల్లిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే

పెనుబల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు సంబంధించి అధికారులు సర్వే నిర్వహిస్తున్నారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల దరఖాస్తులను గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారి వివరాలను సేకరిస్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం మండలంలోని బయ్యన్నగూడెంలో దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారుల ఇళ్ల వివరాలకు సంబంధించి సర్వేను ఎంపీవో ఆర్.ఉపేంద్రయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా దరఖాస్తుదారుల ఇంటి స్థలానికి సంబంధించి ధ్రువపత్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణారెడ్డి, సిబ్బంది పరిశీలించారు.

చెరువును కాపాడరూ..



పసుమర్తివారి చెరువులో జరుగుతున్న రోడ్డు నిర్మాణం

వేంసూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): వేంసూరులోని పసుమర్తివారి చెరువులో సగభాగంలో ఖమ్మం నుంచి దేవరపల్లి వరకు గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. పసుమర్తివారి చెరువు కింద 80ఎకరాల ఆయకట్టు ఉంది. గతంలో చెరువులో నీరు ఉన్నప్పటికీ సరిపడా పొలాలకు అందకపోవడంతో పంటలు ఎండిపోయేవని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం చెరువు సగభాగంలో రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. దీంతో తమ పంటలు ఇకాస్త కూడా పండే పరిస్థితులు లేవని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఈ ఆయకట్టు రైతులు చెరువును లోతు చేయాలని కోరుతూ గ్రీన్‌ఫీల్డ్ అధికారులకు ఒక వినతిపత్రం సమర్పించారు. లోతు చేయకపోగా ఉన్న చెరువులో సగ భాగంలో రోడ్డు నిర్మాణం చేస్తుండటంతో రైతులు తమ పొలాలకు నీరందే పరిస్థితి లేకుండా పోతుందని వాపోతున్నారు. ఇప్పటికైనా నేషనల్ హైవే అధికారులు స్పందించి 80ఎకరాల ఆయకట్టుకు సంబంధించి నీటి సరఫరా కల్పించేందుకు రోడ్డుకు ఎంత భూమి పోయిందో అంత కొనుగోలు చేసి చెరువు నిర్మాణం చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

చురుకుగా షాదీఖానా నిర్మాణ పనులు



కల్లూరులో కొనసాగుతున్న నిర్మాణ పనులు

కల్లూరు, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి) కల్లూరులో నూతనంగా చేపట్టిన ముస్లింల షాదీఖానా నిర్మాణం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. గత ప్రభుత్వంలో రూ.70 లక్షల అంచనాతో ఈ షాదీఖానా పనులు చేపట్టగా, ఎన్నికల తరువాత నిధుల కొరతతో నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఇటీవల ముస్లింలు పనులు నిలిచి పోయిన విషయమై కలెక్టర్, ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. గత సెప్టెంబరు నెలలో జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే రాగమయిలు షాదీఖానాను సందర్శించి పరిశీలించారు. స్పందించిన వారు పనులను పునఃప్రారంభిచే విషయమై హామీ ఇచ్చారు. ఇంకాను షాదీఖానా ప్రాంగణానికి ఎమ్మెల్యే రూ.2.50 లక్షల నిధులను సీసీ రహదారి నిర్మాణానికి మంజూరు చేశారు. షాదీఖానా నిర్మాణం పనుల్లో నిధుల కొరత లేకుండా నిధులను సకాలంలో ప్రభుత్వం నుంచి విడుదల చేయాలని స్థానిక ముస్లింలు కోరుతున్నారు. దీంతో పాటు ప్రాంగణంలో కాంపౌండ్ వాల్, బోరువెల్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

వైరాలో వెలగని వీధిలైట్లు



గాడాంధకారంలో ఉన్న మధిర-జగ్గయ్యపేట రోడ్డు

వైరా, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వైరాలోని జాతీయ ప్రధాన రహదారి నుంచి మధిర-జగ్గయ్యపేట వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డులో సైదులు దర్గా వరకు వారంరోజులుగా ఒక్క వీధిలైట్ కూడా వెలగడం లేదు. ట్రాన్స్‌కో, మునిసిపల్, ఆర్అండ్‌బీశాఖల మధ్య సమన్వయ లోపంతో వైరా ప్రజలు గాడాంధకారంలో గడపాల్సిన దుస్థితి నెలకొంది. రూ.12కోట్లతో 1.8కిలోమీటర్ల ఈ రోడ్డును నాలుగులైన్ల రోడ్డుగా అభివృద్ధి చేస్తున్నారు. దానిలో భాగంగానే ఈ రోడ్డుకు రెండువైపులా ఉన్న విద్యుత్ స్తంభాలను మార్చే పనులు గత పదినెలలుగా జరుగుతున్నాయి. దాంతో ఇక్కడి ప్రజలకు కరెంట్ ఇక్కట్లు తప్పడం లేదు. అంతేకాకుండా గతంలో ఉన్న విద్యుత్ స్తంభాల నుంచి తీగెలను కొత్తగా వేసిన స్తంభాలకు మార్చి గృహ అవసరాల వరకే కనెక్షన్లు ఇచ్చారు. వీధిలైట్ల కనెక్షన్లను విస్మరించారు. ఫలితంగా వారంరోజుల నుంచి ఆర్అండ్‌బీ ప్రధాన రహదారి మొత్తం చీకటిమయంగా ఉంది. రాత్రి వేళల్లో గుంతలమయంగా మారిన రోడ్డుపై ప్రయాణించడానికి ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీధిలైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కాంగ్రెస్‌తోనే ఇందిరమ్మ రాజ్యం

» ఎమ్మెల్యే మట్టా రాగమయి

కల్లూరు, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్‌తోనే ఇందిరమ్మ రాజ్యం వస్తుందని ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. ఆదివారం కల్లూరు మండలంలోని కొర్లగూడెం, పేరువంచ, కల్లూరు, జీడీబి పల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేపట్టారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో ఎ మ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన తర్వా త అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. సత్తుపల్లి నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేస్తామన్నారు. రైతులకు తమ ప్రభు త్వం పంటలకు గిట్టుబాటు ధరతో పాటుగా, మూడు రోజుల వ్యవధిలో వరి క్వింటాకు రూ. 500 బోనస్ అందించడంతో రైతులు ఆనందం గా ఉన్నారని అన్నారు. ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందే విధంగా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్,



పేరువంచ బీసీ కాలనీలో సీసీ రహదారిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

ఏఎంసీ చైర్మన్ బాగం నీరజాదేవి, సీడీసీ చైర్మన్ కస్తాల నరేంద్ర, పసుమర్తి చందర్‌రావు, లక్కినేని కృష్ణ, బాగం ప్రభాకరచౌదరి, అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి, కీసర మధుసూధన్‌రెడ్డి, కీసర శ్రీనిసవాసరెడ్డి, తక్కెళ్లపాటి ప్రసాద్, పాపబత్తిని నగేష్, పీఆర్‌డీఈ కదారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వైరా నియోజకవర్గ అభివృద్ధికి కృషి

» ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్

ఏన్కూరు, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): వైరా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మె ల్యే రాందాస్‌నాయక్ అన్నారు. ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ తెలిపారు. ఆదివారం మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం రైతువేదికలో 40మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. ప్రభుత్వం అన్నివర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేస్తుందని తెలిపారు అర్హులైన ప్రతి ఒక్కరికి పక్కాగృహాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో రమేష్, తహసీల్దార్ శేషగిరిరావు, గుత్తా వెంకటేశ్వరరావు, సొసైటీ చైర్మన్ శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు స్వర్ణనరేంద్రకుమార్, వేముల కృష్ణప్రసాద్,



సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

మేడధర్మారావు, లాలునాయక్, గాలిబ్‌సాహెబ్, వక్కంతుల నాగార్జున, పటాన్‌మజీద్‌ఖాన్, వాసిరెడ్డి నాగేశ్వరరావు, కొనకంచి రామకృష్ణ, గుర్రం రవి, శోభన్‌నాయక్, కట్ట సత్యనారాయణ, పొన్నం హరికృష్ణ, మాదినేని లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



1970-72కి చెందిన ఎస్‌బీఎస్ పూర్వ విద్యార్థులు

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి శ్రీ బండి శోభనాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాల 2వ బ్యాచ్ (1970-72) పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం కళాశాలలో జరిగింది. సరిగ్గా 52ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. ఏడు పదులు వయస్సు దాటినా ఆనాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. 51మందిలో 24మంది హాజరయ్యారు. సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా కళాశాలకు రూ.10వేల విలువైన ప్రింటర్‌ను వితరణగా అందజేశారు. అనంతరం బండి శోభనాచలం, జలగం వెంగళరావు, చిట్లూరి బవసయ్య, ఉడతనేని సత్యంలతో పాటు విద్యాబుద్ధులు నేర్పించిన అధ్యాపకులు, సిబ్బంది, తమతో చదువుకుని మృతిచెందిన 18మంది పూర్వ విద్యార్థులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో కొత్తూరు ప్రభాకరరావు, కొక్కండ చంద్రశేఖర్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ కుమారస్వామి, డాక్టర్ దేవదాస్, సీపీఆర్వో సుబ్రహ్మణ్యశాస్త్రి, బండి రఘుపతిరెడ్డి, బండి రామచంద్రుడు, బండి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'పెరిగిన నిత్యావసర ధరలు తగ్గించాలి'

వైరా, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని కోరుతూ ఐద్వా ఆధ్వర్యంలో ఆదివారం సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రేచర్ల బజార్, బోడేపూడి కాలనీలలో సంతకాల సేకరణ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వలన రోజురోజుకు నిత్యావసర ధరలు పెరుగుతున్నాయని అన్నారు. కేరళ తరహాలో 17రకాల నిత్యావసర వస్తువులను రేషన్‌షాపుల ద్వారా పేదలకు అందించాలని కోరుతూ సంతకాల సేకరణ చేశారు. ఐద్వా నాయకురాళ్లు తోట కృష్ణవేణి, మాదినేని రజిని, మాడపాటి సుజాత, రమాదేవి, భానుమతి, సరోజిని, తాటి కృష్ణకుమారి, కళావతి, ఆశ, బేబి పాల్గొన్నారు.

బుగ్గపాడు శివాలయంలో జలగం పూజలు



పూజలు చేస్తున్న జలగం వెంకట్రావ్

సత్తుపల్లిరూరల్, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బుగ్గపాడులోని శ్రీ విశ్వధర్మక్షేత్రం శివాలయంలో ఆదివారం మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వెల్లటూరి ప్రసాదాచార్యులు, తుమ్మూరు ప్రసాద్, తుమ్మూరు శ్రీనివాసరావు, వెల్లటూరి పవన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జలగం మండలంలోని రామానగరంలో ఇటీవల మృతి చెందిన దండు హుస్సేన్ కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత

కారేపల్లి డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గేటుకారేపల్లి గ్రామానికి చెందిన పొట్లకాయల వెంకటేశ్వర్లు కుటుంబానికి మండల మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బియ్యం వితరణగా అందజేశారు. మండల కేంద్రంలో మృతుడు కుమారుడికి అందజేశారు. ఈకార్యక్రమంలో పగడాల మంజుల, అడపపుల్లరావు, పొట్లకాయల రమేష్, గమిడి నర్సింహరావు, సురేష్, వాకాటి సురేష్, పగడాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.



బాధితకుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

'ఎస్సీ వర్గీకరణను తక్షణమే అమలు చేయాలి'

కొణిజర్ల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు జడ్జిమెంట్ ఆధారంగా ఎస్సీల వర్గీకరణను తక్షణమే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటించిన విధంగా ఎస్సీ వర్గీకరణ చేసి 57 ఎస్సీ ఉపకులాలకు న్యాయం చేయాలని కోరారు. ఎస్సీ వర్గీకరణ చేసేంత వరకు ఉద్యమిస్తామన్నారు. ఎస్సీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండల విస్తృతస్థాయి నూతన కమిటీలను నియమించారు. కార్యక్రమంలో ఏపూరి వెంకటేశ్వరరావు మాదిగ, ఇస్నేపల్లి అశోక్ మాదిగ, కూరపాటి సునిల్ మాదిగ తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

16,17తేదీల్లో కలెక్టరేట్ ఎదుట వంటావార్పు

వైరా, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్నబోజన వర్కర్స్ ఈనెల 16,17న నిర్వహించే వంటావార్పు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ వైరా పట్టణ కన్వీనర్, జిల్లా నాయకులు అనుమోలు రామారావు, తోట నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఆదివారం వైరాలో జరిగిన మధ్యాహ్నబోజన వర్కర్స్ సమావేశంలో వారు మాట్లాడారు. రోజురోజుకు నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నా మధ్యాహ్నబోజన వర్కర్లకు ఇచ్చే మొత్తాన్ని పెంచడం లేదని, బిల్లులు కూడా సకాలంలో చెల్లించడం లేదని విమర్శించారు. ఈ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ముందు 16,17తేదీల్లో నిర్వహించే వంటా వార్పు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ప్రమీల, మంగమ్మ, హుస్సేన్‌బీ, కృష్ణవేణి, కరుణ, పుష్పావతి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామారావు

ఓ వైపు వరినాట్లు.. మరో వైపు అన్నదాతల పాట్లు

» సత్తుపల్లి మండలంలో ఊపందుకున్న వరినాట్లు » రోడ్లపైనే ధాన్యపురాశులు ఆరబోస్తున్న రైతులు



సిద్దారం గ్రామంలో నాట్లు వేస్తున్న కూలీలు

సత్తుపల్లిరూరల్, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి) : సత్తుపల్లి మండలంలో రైతులు, కూలీలు సాగుపనుల్లో బిజిబిజీగా కనిపిస్తున్నారు. ఇప్పటికే వరినాట్లు వేగం పుంజుకోగా, ఆలస్యంగా పంటలు వేసిన రైతులు వరి కంకులు కోసి కల్లాల్లో, రోడ్లపై ధాన్యపు రాశులను ఆరబోస్తున్నారు. వాతావరణ పరిస్థితులు దృష్ట్యా ఒకింత అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. సరిగ్గా ఏడాది క్రితం ఇదే నెలలో ప్రకృతి విలయతాండవం చేసింది. దీంతో రైతులంతా వచ్చినకాడికి కోతలు కోయిస్తూ పంటను ఇళ్లకు చేర్చుకోవడం, దళారులు, మిల్లర్లకు అమ్ముకోవడం, ధాన్యం కొనుగోలు కేంద్రాలకు చేర్చడం కనిపిస్తుంది. కాగా ప్రభుత్వం క్వింటాకు రూ.2,320 (ఏ గ్రేడ్), సాధారణం రూ.2,300కొనుగోలు చేస్తుంది.

రైతుల నుంచి దళారులు సుమారు రూ.1450-1650ధరకు కొనుగోలు చేస్తున్నట్లుగా సమాచారం. ఈ ఏడాది కాంగ్రెస్ ప్రభుత్వం బోనస్ ఇస్తామన్నా కొందరు రైతులు ముందుగానే ఒప్పందాలు కుదుర్చుకోవడంతో దళారులకు అప్పగించేస్తున్నారు. మండలంలో వరి పంట ఈ ఏడాది ఖరీఫ్‌లో సుమారు 19,600ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. వేయగా 200-300కోత కోయాల్సి ఉంది. కాగా ఇప్పటికే 200ఎకరాలలో వరినాట్లు రైతులు వేయగా, ఈసారి సుమారు 15,600-16,000ఎకరాలలో పంటసాగవుతుందని ఏవో వై.శ్రీనివాసరావు అంచనా వేస్తున్నారు.



సదాశివునిపేటలో రోడ్లపై ఉన్న ధాన్యపు రాశులు

ఆకాశం మేఘావృతం..

తల్లాడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం ఆకాశం మేఘావృతం కావడంతో ధాన్యం రైతులు ఆందోళన చెందారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు(ఎన్నెస్పీ) ఆయకట్టు కింద సాగుచేసిన వరి కోతలు, ధాన్యం నూర్పిలు ప్రస్తుతం ముమ్మరంగా జరుగుతున్నా యి. ఈ తరుణంలో అల్పపీడన ప్రభావంతో ఆకాశం మేఘావృతం కావడంతో వర్షం వస్తుందని ఆందోళన రైతుల్లో మొదలైంది. ఆరబెట్టిన ధాన్యం వర్షం వస్తే తడవకుండా ఉండేందుకు ముందుజాగ్రత్త చర్యగా రైతులు టార్పాలిన్ పట్టాలు కప్పారు.



ధాన్యంపై పట్టాలు కప్పి ఉంచిన దృశ్యం

దెందుకూరులో సీఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభం

మధిర రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మధిర మండల దెందుకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీఎం కప్ క్రీడా పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను దెందుకూరు సొసైటీ చైర్మన్ కోట వెంకటకృష్ణ ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించే విధంగా పాఠశాలల్లో ఈ పోటీలను ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. స్థానిక విద్యార్థులు క్రీడాల్లో బాగా రాణించి పాఠశాలకు మండలస్థాయిలో మంచి పేరు తీసుకురావాలన్నారు. క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో ప్రభాకర్, కార్యదర్శి నాగేంద్రబాబు, పీఈటీ చిన్ని, విద్యార్థులు పాల్గొన్నారు.

సాయిబాబా మందిరంలో గాయత్రీ హోమం

వైరా, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం వైరాలోని సాయిబాబా మందిరంలో గాయత్రీ హోమాన్ని నిర్వహించారు. ఆపరిషత్ అధ్యక్షుడు బొడ్డు కృష్ణయ్య, సాయిబాబా మందిర కమిటీ ఆధ్వర్యంలో హోమాన్ని నిర్వహించి గాయత్రీ హోమం విశిష్టతను వివరించారు. 60మంది దంపతులు ఈ హోమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అనుమోలు భాస్కర్‌రావు, లగడపాటి బోస్, మిద్దే సుబ్బారావు, నల్లమోతు వెంకటేశ్వరరావు, మాదినేని దుర్గాప్రసాద్, గోపాలకృష్ణారెడ్డి ఉన్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

కల్లూరు, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని యోగా గరువు, కాకతీయ షుగర్ ఫ్యాక్టరీ ప్లాంట్ ఇంజనీర్ కొడాలి రఘునాథబాబు అన్నారు. కల్లూరులోని మినీ స్టేడియం ప్రాంగణంలో వాకర్స్ ఆసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పురుషులకు, మహిళలకు వాకింగ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన పలువురికి ఆరోగ్యకరమైన సూచనలు అందించారు. శరీరానికి సరిపోయే నీరు తీసుకుంటూ, మిత ఆహా రం తింటూ, సూర్యోదయం, సూర్యాస్తమయానికి మధ్యనే భోజనం చేయాలని సూచించారు. ఆరోగ్యానికి ప్రథమ ప్రాధాన్యతనివ్వాలని వాకర్స్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ తరుపున మద్దినేని రాధాకృష్ణ, ఎం. పుల్లయ్య, దోసపాటి భాస్కరరావు, మద్దినేని శ్రీను, పెద్దబోయన రామనరసింహారావు, పసుపులేటి వీరరాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.



పోటీల్లో విజేతలుగా నిలిచిన వాకర్స్

ఘనంగా అయ్యప్పల ఇరుముడి కార్యక్రమం

తల్లాడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్‌స్టేషన్ రోడ్డులోని శ్రీలక్ష్మీ నర్సింహా ఫ్రూట్స్ ఛాం బర్ వద్ద ఆదివారం అయ్యప్ప మా లధారుల ఇరుముడి కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈలప్రోలు లాల య్య, పొన్నం శ్రీకాంత్ గురుస్వాముల ఆధ్వర్యంలో అర్చకులు టి.మణికంఠశర్మ మాలధారులకు ఇరుముడి కట్టారు. అన్నదాన కార్యక్రమాన్ని ఎస్ఐ బి.కొండల్‌రావు ప్రారంభించారు. కార్యక్రమంలో గురుస్వాములు వేమిరెడ్డి కృష్ణారెడ్డి, పెరిక నాగేశ్వరరావు, బొడ్డు మల్లయ్య, దూపాటి భద్రరాజు, నరేష్‌రాజు, మొక్కా బసవయ్య పాల్గొన్నారు.

కారేపల్లి, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కారేపల్లి క్రాస్‌రోడ్డులో ఆదివారం అయ్యప్ప స్వాముల ఇరుముడి కార్యక్రమం స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో జరిగింది. గురుస్వాములు ఉప్ప వెంకన్న పుల్లయ్య, శ్రీనువాసులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.



తల్లాడలో ఇరుముడి కార్యక్రమంలో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు